ఈనాడు కాకినాడ

శనివారం అక్టోబరు 5, 2024



పసుపుకొమ్ముల శోభ.. అపర్ణాదేవి ప్రభ

దేవీ నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని అపర్ణాదేవి అమ్మవారిని శుక్రవారం పసుపుకొమ్ములతో బ్రహ్మచారిణిగా అలంకరించారు. దసరా ఉత్సవాల్లో రెండో రోజు అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మహిళలు లలితా సహస్ర నామ పారాయణం, కుంకుమార్చనలు నిర్వహించారు.

- న్యూస్‌టుడే, గొల్లప్రోలు

నేడు దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

కాకినాడ కలెక్టరేట్: కేంద్ర ప్రభుత్వం ఏడీఐపీ పథకం ద్వారా సమకూర్చిన ఉపకరణాలను శనివారం దివ్యాంగులకు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు నగరపాలక సంస్థ పరిధిలోని 3వ డివిజన్, సురేశ్‌నగర్ పార్కులోని కన్వర్టిబుల్ మైదానం వద్ద దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ ఉంటుందన్నారు. ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, పంతం నానాజీ హాజరవుతారని తెలిపారు. శిబిరాల్లో పేర్లు నమోదు చేసుకున్న దివ్యాంగులకు ఉపకరణాలు అందజేస్తామని తెలిపారు.

కొదమసింహమై ఉరికి..

శ్యామలాసెంటర్: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు రాజమహేంద్రవరం వేదికగా శుక్రవారం ప్రారంభమయ్యాయి. క్రీడా విన్యాసాలతో అథ్లెట్లు అబ్బురపరిచారు. 26 జిల్లాల నుంచి సుమారు వెయ్యిమంది క్రీడాకారులు ఈ ఆటల సంబరానికి తరలివచ్చారు.



హర్డిల్స్ విభాగంలో క్రీడాకారిణి విన్యాసం

అదే పంథా.. మారని భూదందా

- రూ.కోట్ల విలువైన భూముల్లో బయటి వ్యక్తుల పాగా
- అసలైన యజమానులకు అడ్డంకులు



కాకినాడ చీడీలపార ప్రాంతంలో కూలదోసిన ప్రహరీ

ఈనాడు, కాకినాడ: ఖాళీ భూముల చుట్టూ భూ రాబందుల రెక్కల చప్పుళ్లు ఇంకా వినిపిస్తూనే ఉన్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో రాజకీయ దన్నుతో రెచ్చిపోయి.. ఇష్టారీతిన ఆక్రమించుకున్న వారు, తప్పుడు దస్త్రాలతో పాగా వేసినవారు.. ప్రభుత్వం మారినా కదలడంలేదు. కష్టార్జితమైన భూముల్లోకి యజమానులను అడుగు పెట్టకుండా అడ్డుకుంటున్నారు. స్వాధీనానికి వెళ్తుంటే బెదిరింపులు, రాజకీయ ఒత్తిళ్లు ఎదురవుతున్నాయి. కీలక శాఖల్లో కొందరు అధికారరుల దన్ను నేటికీ అక్రమార్కులకే ఉండటంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

ఎదురుతిరిగారని.. గోడకూల్చేశారు..

కాకినాడ నగరంలోని చీడీలపార ప్రాంతంలో 88 సెంట్ల భూమిని 1999లో పది మంది కొనుగోలుచేశారు. గతేడాది జూన్ 27న కొందరు ప్రైవేటు వ్యక్తులు ఈ స్థలంలోకి చొరబడి టిప్పర్లతో మట్టితోలి చదునుచేసి ఆధీనంలోకి తీసుకున్నారు. యజమానులు ప్రశ్నిస్తే.. మేము వైకాపా ఎమ్మెల్యే మనుషులం అంటూ అప్పట్లో గద్దించారు. బాధితులు పోలీసులను ఆశ్రయించినా భరోసా దక్కలేదు. దీంతో హక్కు పత్రాలతో న్యాయస్థానానికి వెళ్లారు. చుట్టూ రక్షణ గోడ కట్టుకోడానికి న్యాయస్థానం యజమానులకు అనుమతి ఇచ్చింది. కోర్టు జోక్యం చేసుకున్నా కబ్జాదారులు ఆగలేదు. గతనెల 25న రాత్రి యంత్రాలతో స్థలంలోకి వచ్చి రక్షణ గోడను కూల్చేశారు. బాధితులు నక్కా సత్యనారాయణ, ఈడూరి కృష్ణ, కొవ్వూరి చిరంజీవిరెడ్డి, కర్రి భారతి, పెమ్మనబోయిన రామచంద్రరావు రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. సర్వే నంబర్ 199/1/3, 186/1/1లో 38 సెంట్ల భూమి చుట్టూ కట్టిన గోడ కూల్చేశారంటూ ఫిర్యాదు చేసి.. తమకు న్యాయం చేయమని కోరారు.

దస్త్రాలు దిద్దేసి.. కొట్టేసే యత్నం..

కాకినాడ కలెక్టరేట్‌లో గతంలో భూ దస్త్రాల్లో ట్యాంపరింగ్ చోటుచేసుకుంది. దిద్దిన దస్త్రాల ఆధారంగా చీడీలపార ప్రాంతంలోని రూ.కోట్ల విలువైన భూమిని రాజకీయ దన్నుతో కొందరు దక్కించుకోవడానికి ప్రయత్నించడం వివాదాస్పదమైంది. 1951లో ఆంధ్రాబ్యాంకు జప్తు ద్వారా నిర్వహించిన వేలంలో కొప్పుల నాగూరయ్య, చిట్టూరి రామకృష్ణమూర్తి కొన్న భూమి క్రయవిక్రయాలు జరిగాయి. కలెక్టరేట్ రికార్డు రూమ్‌లోని ఆర్ఎస్ఆర్ కాపీలో సర్వేనంబర్ 195/1లో 91 సెంట్ల భూమి యాజమాన్య హక్కు చల్లా వీరన్నశాస్త్రులు, 195/2లో మెట్ట నర్సింహరావు, 195/3లో వనరాశి వీర్రాజు పేరుతో ఉంటే ఆ పేర్లు చుట్టేసి, వేరొకరి పేర్లు రాసేశారు. ఇలా దిద్దుబాట్లతో చిక్కులు తెరమీదికి తేవడం వెనుక రాజకీయం చక్రం తిప్పింది.



దస్త్రాల్లో దిద్దుబాటుతో స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న భూమి ఇదే..

'కాకినాడలోని చీడీలపారలో 2022లో 50 సెంట్ల భూమి తాను కొన్నానని.. షెడ్డు కడుతుంటే కొందరు బెదిరించారని.. కలెక్టరేట్‌లోని రికార్డులు ట్యాంపరింగ్ చేసి, యజమాని పేర్లు మార్చేసి తిరిగి తమపైనే కేసులు వేస్తున్నార'ని భూ యజమాని చలికి వీరేంద్ర గత ప్రభుత్వ హయాంలో ఆరోపించారు. దీనిని గుర్తించామని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అప్పటి జేసీ ఇలక్కియా ప్రకటించినా, అతీగతి లేదు. గతనెల 29న యజమాని భూమిలోకి వెళ్తే ఓ నాయకుడి నుంచి ఒత్తిళ్లు ఎదురయ్యాయి. విషయాన్ని కలెక్టర్ షాన్‌మోహన్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ దృష్టికి తీసుకెళ్లిన బాధితుడు.. మంత్రి లోకేశ్‌ను ఇటీవల కలిసి జరిగిన అన్యాయాన్ని విన్నవించారు.

కార్తికం.. సిద్ధమేనా అన్నవరం

అన్నవరం, న్యూస్‌టుడే: కొద్దిరోజుల్లో పవిత్ర కార్తికమాసం ఆరంభం కానుంది. అన్నవరం సత్యదేవుని ఆలయంలో కీలక వేడుకలు ఈ మాసంలో జరగనున్నాయి. నవంబరు 15న గిరిప్రదక్షిణ, 13న తెప్పోత్సవం ఉంటాయి. మరోవైపు ఈ నెల 27 నుంచి సత్యదీక్షలు ప్రారంభమవుతాయి. గతంలో వేలాది భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న దృష్ట్యా తగిన ఏర్పాట్లుచేయాలని.. సమస్యలు పునరావృతం కాకుండా చూడాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నేడు సమీక్షా సమావేశం జరగనున్న దృష్ట్యా ఇప్పటినుంచే తగిన కార్యాచరణకు అడుగులు వేయాల్సి ఉంది.

తోపులాటలు.. తాగునీటి ఇక్కట్లు

వైకాపా ప్రభుత్వ హయాంలో 2022 కార్తికంలో ఇక్కడి ఉత్సవాలకు ఏర్పాట్లలో అధికారులు విఫలమయ్యారు. క్యూలైన్లు సరిగా లేక తోపులాట చోటుచేసుకుంది. కొందరు చిన్నారులు, వృద్ధులు అస్వస్థతకు గురయ్యారు. భద్రతా లోపం కనిపించింది. వ్రతమండపాలు సరిపోలేదు. గత ఏడాది గిరిప్రదక్షిణకు 1.50 లక్షల మంది హాజరైతే తాగునీరు లేదు. ఆహారం 20 శాతం మందికే సరిపోయింది.

ఇప్పుడు ఏం చేయాలి...

- రూ.200 శీఘ్రదర్శనం, ఉచిత దర్శనాలు, రూ.2 వేలు, రూ. 1,500 వ్రతాలకు ప్రత్యేక లైన్లు ఉండాలి.
- సుమారు 1.50 లక్షల వ్రతాలు జరుగుతాయని అంచనా. ఇందులో 70 శాతం రూ.300 వ్రతాలే. అదనపు మండపాలు వేగంగా సిద్ధం చేయాలి. అన్ని ప్రదేశాల్లో తాగునీటి సౌకర్యాలు కల్పించాలి.
- వివాహ ముహూర్తాలు లేని సమయంలో సత్యగిరిపై ఉన్న విష్ణుసదన్ (వివాహ మండపాలు)ను, రత్నగిరిపై సీతారామసత్రం హాళ్లు డార్మెటరీగా వినియోగించాలి. గదులు ఖాళీ అయిన వెంటనే శుభ్రం చేసి మరొకరికి కేటాయించేలా ప్రణాళిక చేయాలి.
- పలుచోట్ల తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానపుగదులు అవసరం. భక్తులకు అదనపు బస్సులు ఉండాలి.
- దేవస్థానం ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ వద్ద స్నానపుగదులు, మరుగుదొడ్లు తాత్కాలికంగా ఏర్పాటు చేస్తే రైలు మార్గంలో వచ్చేవారికి సౌకర్యం.
- పర్వదినాల్లో భక్తులకు పులిహోర, దద్దోజనం పంపిణీ చేస్తారు. భోజన సౌకర్యం కల్పించడంపై కూడా దృష్టిసారించాలి.

ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రాధాన్యం

కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్



ఈనాడు, కాకినాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రాధాన్యం ఇవ్వాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌ శ్రీనివాస్ కోరారు. పర్యాటక- రవాణా- సాంస్కృతిక రంగాలపై దిల్లీలో శుక్రవారం జరిగిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు పేర్కొన్నారు. పర్యాటక ప్రాంతాలకు వెళ్లలేనివారు ఆలయాల దర్శనానికి వేల సంఖ్యలో వెళ్తున్నందున.. ఆయా ఆలయ ప్రాంగణాల్లో వసతులు, ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తే ఫలితం ఉంటుందన్నారు. ఆధ్యాత్మిక పర్యాటకం అభివృద్ధిలో భాగంగా ఆలయాలకు బస్సు, ఇతర రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలని కోరారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఆహ్లాదంతోపాటు.. చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లే వెసులుబాటు దక్కుతుందన్నారు. కాకినాడ జిల్లాలోని ప్రసిద్ధ అన్నవరం, ఇతర పుణ్యక్షేత్రాలను మరింత అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. దక్షిణ కాశీగా పేరున్న పిఠాపురాన్ని ఆధ్యాత్మిక, పర్యాటకంగా అభివృద్ధి చేస్తే.. పక్కనున్న ఉప్పాడ తీరానికి కూడా పర్యాటకుల తాకిడి పెరుగుతుందన్నారు.

భాగ్యనగరానికి 42 ప్రత్యేక బస్సులు

సాంబమూర్తినగర్ (కాకినాడ), న్యూస్‌టుడే: దసరా పండగ సందర్భంగా ప్రత్యేక బస్సులు తిప్పేందుకు ఆర్టీసీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. జిల్లాకు చెందిన వేలమంది విద్య, ఉద్యోగం, వ్యాపారం నిమిత్తం భాగ్యనగరంలో ఉంటున్నారు. అక్కడ బంధుత్వాలూ ఎక్కువే. ఈ నేపథ్యంలో ఎక్కువ డిమాండ్ ఉండటంతో ఈ మార్గంలో అధిక బస్సులు నడపనున్నారు. కాకినాడ, తుని, ఏలేశ్వరం ఆర్టీసీ డిపోల పరిధిలో హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, శ్రీకాకుళం వంటి ముఖ్య ప్రాంతాలకు బస్సులు నడపనున్నారు. ఈనెల 8 నుంచి 11 వరకు హైదరాబాద్‌కు 42, విజయవాడకు 20, విశాఖకు 20 చొప్పున ఏర్పాటు చేశారు. బెంగళూరుకు ఒక ప్రత్యేక బస్సు సర్వీసును నడపనున్నట్లు డిపో అసిస్టెంట్ కమిషనర్ ఎంయూవీ మనోహర్ తెలిపారు. వీటిలో సూపర్ లగ్జరీ 23, అల్ట్రా డీలక్స్ 14, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు 4 ఉన్నాయి. హైదరాబాద్‌కు ఏర్పాటు చేసిన 42 ప్రత్యేక బస్సుల్లో కాకినాడ నుంచి 18, తుని నుంచి 11, ఏలేశ్వరం నుంచి 13 చొప్పున తిరుగనున్నాయి. రద్దీకి అనుగుణంగా విజయవాడ, విశాఖపట్నం మార్గాల్లో నడుపుతారు.

సాధారణ ఛార్జీలే..

ఆయా మార్గాల్లో నడిచే బస్సుల ఛార్జీలనే ఈ ప్రత్యేక బస్సుల్లోనూ వసూలు చేయనున్నారు. రాకపోకలకు కలిపి ఒకేసారి ముందస్తు రిజర్వేషన్ చేసుకుంటే ఛార్జీలో 10శాతం రాయితీ ఉంటుంది. ఇప్పటికే రిజర్వేషన్ల బుకింగ్ ప్రారంభించారు. ఈ ప్రత్యేక బస్సులు ఆయా డిపోల్లో సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.


తేదీల వారీగా హైదరాబాద్ సర్వీసులు

డిపోలు	8	9	10	11
కాకినాడ	2	3	7	6
తుని	1	2	3	5
ఏలేశ్వరం	1	3	4	5

జిల్లాలో డిపోలు: 3

మొత్తం బస్సులు: 288

దసరాకు ప్రత్యేక బస్సులు: 140 (రెండువైపులా కలిపి)



వెన్నెల కాలంలో ఎండలు



చున్నీతో రక్షణగా..

శరదృతువులో వెన్నెల ఎక్కువగా ఉంటుంది. అటు మండుటెండలు, ఇటు ఎముకలు కొరికే చలి లేకుండా ప్రశాంతంగా ఉంటుంది. కానీ నాలుగు రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇటీవల వర్షాలు పడినా కాకినాడలో మండు వేసవిని తలపిస్తోంది. శుక్రవారం సుమారు 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మధ్యాహ్నం సమయంలో పలు ప్రాంతాలు నిర్మానుష్యంగా కనిపించాయి. వ్యాపారం లేక చిరువ్యాపారులు ఉసూరుమన్నారు. **- ఈనాడు, కాకినాడ**



గొడుగు నీడలో బతుకు

రెండో రోజు 1,209 మంది హాజరు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రెండోరోజైన శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. ఐయాన్ డిజిటల్ జోన్ (ఎస్.అచ్యుతాపురం), సాఫ్ట్ టెక్నాలజీస్ (రాయుడుపాలెం) కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఉదయం 666 మందికి 607 మంది పరీక్ష రాశారు. 59 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 671 మందికి గాను 602 మంది పరీక్ష రాశారు. 69 మంది గైర్హాజరు అయినట్లు విద్యాశాఖ ఏడీ నాగేశ్వరరావు తెలిపారు.

'పొలం పిలుస్తోంది'తో బహుళ ప్రయోజనాలు

కాకినాడ నగరం: సాగుపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాలతో రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు (జేడీ) ఎన్.విజయ్‌కుమార్ సూచించారు. స్థానిక కృషిభవన్‌లో శుక్రవారం ఉమ్మడి జిల్లాకు చెందిన వ్యవసాయ అధికారులతో మేలైన వ్యవసాయ పద్ధతులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జేడీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ అధిక రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగంతో నష్టమే జరుగుతుందన్నారు. అవసరం మేరకే వినియోగించాలన్నారు. డిజిటల్ మార్కెటింగ్‌పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయాధికారులు లక్ష్మిరెడ్డి, యుగంధర్ తదితరులు వివిధ అంశాలను వివరించారు. ఆత్మ పథక సంచాలకురాలు జ్యోతిర్మయి, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జేడీ

బాధ్యతల స్వీకరణ

కాకినాడ కలెక్టరేట్, నగరం, న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో)గా వి.రవికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన కె.భారతీ సౌజన్య శ్రీకాకుళం బదిలీ అయ్యారు. రవికుమార్ బాపట్ల నుంచి వచ్చారు. కలెక్టర్ షాన్ మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పంచాయతీల బలోపేతానికి కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు, ఆదాయం అభివృద్ధి, నూరుశాతం పన్ను వసూలుపై దృష్టి పెడతామన్నారు.



రవికుమార్, డీపీవో



మల్లిబాబు, ఆర్డీవో

- కాకినాడ రెవెన్యూ డివిజన్ ఆఫీసర్‌గా ఉప కలెక్టర్ ఎస్.మల్లిబాబు ఆర్డీవో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలో డిప్యూటీ సీఈవోగా పనిచేస్తూ ఉప కలెక్టర్ల బదిలీల్లో భాగంగా కాకినాడ ఆర్డీవోగా నియమితులయ్యారు. ఈయన ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో తహసీల్దారుగా పనిచేశారు. ఉప కలెక్టర్‌గా డీఆర్‌డీఏ పీడీ, సెట్రాజ్ సీఈవో, పెద్దాపురం ఆర్డీవోగా సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో డి.తిప్పేనాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

బ్యాంకు దోపిడీ కేసు ఛేదనలో పోలీసులకు పురస్కారం

రాష్ట్ర అవార్డుల్లో జిల్లాకు ప్రథమస్థానం

ప్రత్తిపాడు, మసీదు సెంటర్(కాకినాడ): ఏబీసీడీ అవార్డుల్లో జిల్లా పోలీసులకు ప్రథమ స్థానం లభించింది. ప్రత్తిపాడు మండలంలోని ఉత్తరకంచి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి దోపిడీ కేసు ఛేదించిన జిల్లా పోలీసు బృందానికి బెస్ట్ ఇన్ క్రైం డిటెక్షన్(ఏబీసీడీ) అవార్డు ప్రకటించారు. డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆయన కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. కేసుల ఉత్తమ ఛేదనలో ఇచ్చే ఈ అవార్డుకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన వాటిలో కాకినాడ జిల్లా పోలీసులు ప్రథమ స్థానంలో నిలిచారు. కేసును దర్యాప్తు చేసిన అప్పటి ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీ లతాకుమారి, సీఐలు శేఖర్‌బాబు, సురేష్‌లు, ఎస్సై పవన్‌కుమార్, అబ్దుల్ నబీ బృందాన్ని డీజీపీ అభినందించి ప్రశంసాపత్రాలతో పాటు రివార్డును అందజేశారు. గత ఫిబ్రవరి 7న ఉత్తరకంచి గ్రామ కూడలిలో ఉన్న బ్యాంకు భవనం వెనుక వైపు కిటికీని గ్యాస్‌కట్టర్‌తో తొలగించి దోపిడీ చేశారు. రూ.27 లక్షలు, 25 సంచుల్లోని బంగారు వస్తువులు దోచుకున్నారు. అప్పటి ఎస్పీ సతీష్‌కుమార్ నేతృత్వంలో ప్రత్తిపాడు పోలీసులు అంతర రాష్ట్ర దొంగలను పట్టుకుని, చోరీ సొత్తును రాబట్టారు. ఇది స్ఫూర్తిదాయకమని ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు తెలిపారు.




డీజీపీతో జిల్లా పోలీసు ఉన్నతాధికారులు

దయ.. సహనం.. రాజసం

అమ్మను కొలిచే భాగ్యం అమోఘం. పసుపుకుంకుమల సౌభాగ్యం. దయ, సహనం, రాజసం ఉట్టిపడే అలంకారప్రియం. దేవీ పాహిమాం అంటూ.. అంతటా శక్తి స్వరూపినిని వేడుతున్న భక్త జనం. వెరసి శరన్నవరాత్రుల్లో రెండో రోజు శుక్రవారం ఆలయాలు, మండపాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచాయి. భవానీ మాలధారులతో అన్నిచోట్లా చల్లని తల్లి సన్నిధి.. భక్తజన పెన్నిధిగా మారింది. అమ్మవారిని వివిధ రూపాల్లో కొలువుదీర్చి దర్శనం కల్పించారు. అన్నింటా విజయం కోరుతూ దశమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి.

- న్యూస్‌టుడే బృందం



గొల్లప్రోలులో గాయత్రీ దేవిగా..


కాకినాడలో బాలాత్రిపుర సుందరి


తుని(గ్రామీణం: గాయత్రీదేవిగా లోవ తలుపులమ్మ దర్శనం


పిఠాపురం: ప్రత్యేకాలంకరణలో పురుహూతిక అమ్మవారు

కిరణ్ కంటి ఆసుపత్రికి రూ.10 లక్షల విరాళం


విరాళం డీడీ అందిస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రతినిధులు

గాంధీనగర్: శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి అభివృద్ధి, ఆసుపత్రిలో జనరేటర్ కొనుగోలుకు బ్యాంక్ ఆఫ్ బరోడా రమణయ్యపేట శాఖ తరఫున రూ.10 లక్షల విరాళాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ సంకర్షణ్ చంద్రశేఖర్‌ను రమణయ్యపేట బ్యాంకు శాఖ చీఫ్ మేనేజర్ బొండాడ వెంకటరమణ ఆధ్వర్యంలో సత్కరించారు. ముఖ్య అతిథిగా బ్యాంకు జోనల్ హెడ్ ఎస్.రవీంద్రనాథ్ ఠాగూర్ హాజరయ్యారు. సీఎస్ఆర్ నిధుల్లో భాగంగా ఇవ్వనున్నట్లు వివరించారు. ఆసుపత్రి సేవలు కొనియాడారు. బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కనికరించే దేవత కనకదుర్గమ్మ


అమ్మవారికి హారతి ఇస్తున్న స్వామీజీ

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: అమ్మ అంటే.. కరుణించే దేవత కనకదుర్గమ్మగా కాకినాడ గ్రామీణం రమణయ్యపేటలోని శ్రీపీఠంలో ఐశ్వర్యాంబిక అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీమహాశక్తియాగం-2024, శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు అరుణవర్ణ ఏకరూప వస్త్రధారణలో సామూహిక కుంకుమ పూజలకు తరలివచ్చారు. పీఠాధిపతి స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో లక్ష పసుపు కొమ్ములతో అర్చన జరిగింది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వేదపండితులు సహస్రరుద్ర పారాయణం, శతచండీ హోమం తదితరాలు నిర్వహించారు. రెండో రోజు 32 వేల మంది హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. భక్తి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కాకినాడ డీఎస్పీ రఘువీర్‌విష్ణు పర్యవేక్షణలో సీఐలు పెద్దిరాజు, చైతన్యకృష్ణ, రామారావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. శనివారం శ్రీపీఠంలోని గోశాల ప్రాంగణానికి అయోధ్య రామాలయంలో ప్రతిష్ఠించనున్న రజత విల్లు, బంగారం అంబులను భక్తుల దర్శనంకోసం ఉంచనున్నారు.

రంగరాయకు 66 వసంతాలు

వైద్య కళాశాలలో నేడు వేడుకలు



మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ రంగరాయ.. ఇదేదో సాదాసీదా పేరు కాదు.. ఒక బ్రాండ్. రాష్ట్రంలో ప్రముఖమైన వైద్య కళాశాలల్లో ఒకటి. 1958లో మొదలై వేల మంది వైద్యులను తయారుచేసింది. అందులో దేశ, విదేశాల్లో పేరొందిన వైద్యులు కూడా ఉన్నారు. విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి అనుబంధంగా ఈ కళాశాల పనిచేస్తుంది. ఏటా అక్టోబర్ 5న కళాశాల వార్షికోత్సవం నిర్వహిస్తారు. శనివారం జరిగే వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు. అనుభవజ్ఞుల మాటకు, విద్యార్థుల ఆటపాటలకు.. ఇలా 66 ఏళ్ల జ్ఞాపకాలకు ఆర్ఎంసీ కళాశాల ఆడిటోరియం వేదికైంది.

ఈ రోజు కార్యక్రమాలు..

కార్యక్రమాల్లో భాగంగా కళాశాల వార్షిక నివేదిక ప్రవేశపెట్టనున్నారు. గతంలో కన్నా పెరిగిన వసతులు, నిర్మాణాలు, ఏర్పాట్లు తదితర అంశాలతో కళాశాల ప్రగతి గురించి వివరిస్తారు. వివిధ పోటీలు, సదస్సుల్లో పాల్గొని పతకాలు సాధించిన వారు, అకడమిక్స్‌లో బంగారు పతకాలు పొందిన వారి గురించి ప్రస్తావిస్తారు. పలు పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారికి బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ కింద బంగారు పతకాలు ఇవ్వనున్నారు. అన్ని రంగాల్లో మొత్తం 39 మంది వైద్య విద్యార్థులకు బంగారు పతకాలు, పురస్కారాలు అందించనున్నారు. అనంతరం విద్యార్థుల ఆటపాటలతో ముగింపు పలుకుతారు.

పేరు తీసుకురావాలి..



ఆర్ఎంసీలో నిపుణులైన వైద్యులు, అధ్యాపకులు ఉన్నారు. పూర్వ విద్యార్థుల సహకారం, చొరవతో కళాశాలకు మరిన్ని సదుపాయాలు సమకూరుస్తున్నాం. వైద్య వృత్తిలో వస్తున్న ఆధునిక మార్పులను గమనించాలి. కళాశాలకు, తల్లిదండ్రులకు విద్యార్థులు పేరు తీసుకురావాలి.

- డా.డీఎస్‌వీఎల్ నరసింహం, డీఎంఈ, ఆర్ఎంసీ ప్రిన్సిపల్

అన్ని ఏర్పాట్లు చేశాం..



కళాశాల వార్షిక దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎంబీబీఎస్ విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు అందిస్తాం. మెమోరియల్ బహుమతుల పంపిణీ జరుగుతుంది. ఇందులో భాగమవ్వడం ఆనందంగా ఉంది.

- డా.ఎ.విష్ణువర్ధన్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపల్

అట్టహాసంగా రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్

శ్యామలాసెంటర్ (రాజమహేంద్రవరం): రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పలు జిల్లాల నుంచి క్రీడాకారులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ జిల్లాలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు, శాయ్ క్రీడా వికాస కేంద్రాన్ని తీసుకొస్తామన్నారు. ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ నగరంలో క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. తొలి రోజు రన్నింగ్, త్రోయింగ్, జంపింగ్ విభాగాల్లో పోటీలు జరిగాయి. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ రామచంద్ర, శిక్షకుడు డి.శేషగిరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైకాపా ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధి శూన్యం

కాజులూరు: వైకాపా ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని మంత్రి సుభాష్ అన్నారు. శుక్రవారం మంజేరు, శీల, శలపాక, తనుకువాడ తదితర గ్రామాల్లో 'మన ఊరు- మన సుభాష్' కార్యక్రమం నిర్వహించారు. సమస్యలు తెలుసుకున్నారు. మంజేరులో మంత్రి మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం దోచుకు తినడానికే పెద్దపీట వేసి రాష్ట్రాభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు. సంక్షేమం పేరుచెప్పి రూ.కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్కొక్క పథకం అమలు చేస్తున్నామన్నారు. పోలిశెట్టి చంద్రశేఖర్, చుండ్రు వీర్రాజు చౌదరి, గండి మణికంఠ, కోమలి వెంకటరమణ, పోతు గనిరాజు, పలుశాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శిశువుకు శస్త్రచికిత్స సఫలం.. కార్డియాక్ అరెస్టుతో మృతి

మసీదుసెంటర్(కాకినాడ): కాకినాడ జీజీహెచ్‌లో శిశువుకు వైద్య నిపుణులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. సూపరింటెండెంట్ డా.లావణ్యకుమారి శుక్రవారం తెలిపిన వివరాల మేరకు.. ఓ మహిళకు 33 రోజుల క్రితం ఆడబిడ్డ పుట్టింది. శిశువు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతోంది. తేలికపాటి ఎనస్థీషియాగా పరీక్షించారు. ఎయిర్‌వే ట్యూబ్ 95 శాతం కుచించుకుపోయినట్లు గుర్తించారు. పుట్టుకతో వచ్చే ఈ వ్యాధికి శ్వాసనాళం ద్వారా చిన్న గొట్టం పంపి శస్త్రచికిత్స చేస్తారు. అది విఫలమైతే శిశువు మెడ ముందు రంధ్రం చేసి, ట్యూబ్‌తో పంపిస్తారు. శస్త్రచికిత్స సమయంలో వాయునాళం ద్వారా అతిచిన్న ట్యూబ్‌ను పంపడం సాధ్యం కాలేదు. దీంతో గురువారం అత్యవసర ట్రాకియోస్టమీ నిర్వహించారు. అనంతరం పీడియాట్రిక్ ఐసీయూలో ఉంచారు. గాలి తీసుకున్నట్లు గుర్తించారు. ఇంతవరకూ బాగానే ఉన్నా శుక్రవారం తెల్లవారుజామున శిశువు కార్డియాక్ అరెస్ట్‌తో మృతిచెందినట్లు తెలిపారు. చిన్నారిని కాపాడేందుకు ఎంతగా ప్రయత్నం చేసినా దక్కకపోవడంతో విషాదఛాయలు అలముకున్నాయి.


శిక్షణకు ఓఎన్‌జీసీ సహకారం


మాట్లాడుతున్న రత్నేష్‌కుమార్

గాంధీనగర్: జేఎన్‌టీయూకే అధ్యాపకులు, విద్యార్థుల శిక్షణ కార్యక్రమాలకు ఓఎన్‌జీసీ సహకరిస్తుందని ఓఎన్‌జీసీ ఈస్ట్రన్ అఫ్‌షోర్ అసెట్, హెచ్‌పీహెచ్‌టీ అసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, అసెట్ మేనేజర్ రత్నేష్‌కుమార్ తెలిపారు. జేఎన్‌టీయూకే ప్రాంగణంలో శుక్రవారం అలూమ్ని ఆడిటోరియంలో యూసీఈకే పెట్రోలియం, కెమికల్ ఇంజినీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో జేఎన్‌టీయూకే సొసైటీ ఆఫ్ పెట్రోలియం ఇంజినీర్స్(ఎస్‌పిఇ) స్టూడెంట్ చాప్టర్ ప్రారంభించి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వేడుకలు నిర్వహించారు. జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, ఓఎన్‌జీసీ అసెట్, హెచ్‌పీహెచ్‌టీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, అసెట్ మేనేజర్ రత్నేష్‌కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మురళీకృష్ణ మాట్లాడుతూ అత్యధిక వేతనం అందుకునేది పెట్రోలియం ఇంజినీర్లు మాత్రమేనన్నారు. జేఎన్‌టీయూకే అధ్యాపకులు, విద్యార్థులకు ఓఎన్‌జీసీ తరపున సహకరించాలని సూచించారు. 2024-25 సంవత్సరానికి జేఎన్‌టీయూకే ఎస్‌పీఈ స్టూడెంట్ చాప్టర్‌కు ఎన్నికైన నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఓఎన్‌జీసీ ఉన్నతాధికారులు అనుపమ్ సక్సేనా, సునీల్‌కుమార్, ప్రబల్‌సేన్ గుప్తా, కిషోర్‌కుమార్, ప్రొఫెసర్ టి.లక్ష్మణ్‌కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత... ముగ్గురికి ప్రాణదాత

గ్రీన్ ఛానల్‌లో విశాఖకు అవయవాల తరలింపు


కల్యాణ్‌చక్రవర్తి (పాత చిత్రం)

మసీదు సెంటర్ (కాకినాడ), మండపేట గ్రామీణం: ఆ రైతు తాను ఉన్నంత కాలం సాగు చేస్తూ పది మంది కడుపు నింపారు. తాను లేకపోయినా మరో ముగ్గురికి ప్రాణదానం చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపాడు. వివరాల్లోకి వెళ్తే.. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన రైతు రెడ్డి కల్యాణ్‌చక్రవర్తి(51) రాజానగరం పరిధిలో ఈ నెల 2న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కాకినాడ అపోలో ఆసుపత్రికి తరలించారు. బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. వారి సూచనలతో అతని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు అవయవాల దానానికి అంగీకరించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం శస్త్రచికిత్స చేసి రెండు మూత్రపిండాలు, కాలేయం వేరు చేశారు. ఓ మూత్రపిండాన్ని విశాఖపట్నం అపోలో ఆసుపత్రికి, కాలేయాన్ని విశాఖలోని పినాకిల్ ఆసుపత్రికి వేర్వేరు వాహనాల్లో తరలించారు. రెండో మూత్రపిండాన్ని కాకినాడ అపోలోని మరో రోగికి అమర్చనున్నారు. అవయవాలను జీవన్‌దాన్‌లో భాగంగా విశాఖకు తరలించేందుకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో పోలీసులు గ్రీన్‌ఛానల్ ఏర్పాటు చేశారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	12,000
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	15,000-15,500
కొత్త (పచ్చి) కాయ	14,000-14,500
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

కాలువలో మునిగి ఇద్దరు విద్యార్థుల మృత్యువాత


అభిరామ్


దుర్గాప్రసాద్

(పాత చిత్రాలు)

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: పాఠశాలకు కలిసి వెళ్లొచ్చే స్నేహితులిద్దరూ.. మృత్యువులోనూ కలిసే కన్నోళ్లకు దూరమయ్యారు. బాధితులు, స్థానికుల వివరాల ప్రకారం.. కాకినాడ గ్రామీణం తూరంగికి చెందిన జక్కి వెంకటదుర్గా, గండికోట నూకరాజు కూలి పనులతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. వెంకటదుర్గా కొడుకు అభిరామ్(8), నూకరాజు కొడుకు దుర్గాప్రసాద్(10) మరో ఇద్దరు విద్యార్థులతో కలిసి స్థానిక పంట కాలువలో స్నానాలకు వెళ్లారు. వారిలో అభిరామ్, దుర్గాప్రసాద్ మునిగిపోయారు. స్థానికులు రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. నీళ్లు మింగేయడంతో ప్రాణాలు కోల్పోయారు. వీరి రెండు కుటుంబాలకు చెందిన మగ బిడ్డలిద్దరూ మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. అభిరామ్ ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి, దుర్గాప్రసాద్ నాలుగో తరగతి చదువుతున్నారు. స్నేహితులు చనిపోయారని తెలిసి మిగతా విద్యార్థులు విషాదంలో మునిగిపోయారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. వారి తండ్రులు ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఇంద్రపాలెం ఎస్సై వీరబాబు తెలిపారు.

కాకినాడ

నగరంలో సినిమాలు

గాంధీనగర్: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్- **దేవర పార్ట్ 1,** దక్షిణ, సత్య సుందరం, దేవీ మల్టీప్లెక్స్ 4స్క్రీన్- **దేవర పార్ట్ 1,** సత్యం సుందరం, కాళీ, లక్ష్మీ- **దేవర పార్ట్ 1,** సత్యగౌరి- **దేవర పార్ట్ 1,** తిరుమల - మన్మధ, సిఅండ్‌సీ 1- మత్తువదలరా 2, సీఅండ్‌సీ 2- శ్వాగ్, శ్రీప్రియ - **రామ్‌నగర్ బన్నీ,** పద్మప్రియ- **దేవర పార్ట్ 1,** సూర్య1(వాకలపూడి) - **దేవర పార్ట్ 1,** సూర్య 2- మిష్టర్ సెలబ్రిటీ, శ్రీశ్రీనివాసా(వేళంగి)- **దేవర పార్ట్ 1.**

రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్, న్యూస్‌టుడే: టమాటా - 40, వంకాయలు - 40,50,60, బెండకాయలు - 40, పచ్చిమిర్చి - 36, కాకరకాయ - 40, బీర - 36,46, కాలీఫ్లవర్ - 20, క్యాబేజీ - 38, క్యారెట్ - 50, దొండకాయలు - 54, బంగాళాదుంపలు - 30,36, ఉల్లి - 50,55, గోరుచిక్కుళ్లు - 34, దోసకాయలు - 34, ఆనబకాయ - 25,30, పొట్లకాయ - 18,20, అరటికాయ - 6,7, చిక్కుళ్లు - 64, చేమదుంపలు - 42, మునగకాడలు - 12,13, బీట్‌రూట్ - 38, కీరదోస - 28, బీన్స్‌కాయలు - 70, అల్లం - 50, క్యాప్సికం - 80, బొబ్బర్లు - 46, చిలకడదుంపలు - 40, మామిడికాయ - 15,18, నిమ్మకాయలు(డజన్) - 24,60.

ఆడుతూ.. కలల కొలువుకు సాధన

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: సర్కారు కొలువు వారి కల. అందుకు హాకీని ఓ మార్గంగా ఎంచుకున్నారు. పేదరికం వెక్కిరిస్తున్నా ప్రతిభతో సత్తా చాటుతున్నారు. పలు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో శ్రీకాకుళంలో జరిగిన జూనియర్ మహిళల రాష్ట్ర ఛాంపియన్‌షిప్ పోటీల్లో మెరిశారు. ఈనెలలో రాంచీలో జరిగే 14వ జూనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. కాకినాడ డీఎస్ఏలోని హాకీ టర్ఫ్ కోర్టులో కోచ్ వి.రవిరాజు నేతృత్వంలో శిక్షణ పొందారు. జాతీయ పోటీలకు వెళ్తున్న సందర్భంగా న్యూస్‌టుడేతో తమ అభిప్రాయాలు పంచుకున్నారిలా..


హాకీ ఆడుతున్న క్రీడాకారిణులు

ఐపీఎస్ అవుతా..



డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నా. నాన్న నూకరాజు కారు డ్రైవర్, అమ్మ కుమారి గృహిణి. ఎనిమిదేళ్ల నుంచి హాకీ ఆడుతున్నా. ఇప్పటివరకు సుమారు 20 రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించా. రెండుసార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఐపీఎస్ కావాలనేది నా లక్ష్యం. **- భాగశ్రీ**

రైల్వేలో ఉద్యోగమే ధ్యేయం..



డిగ్రీ మొదటి ఏడాది చదువుతున్నా. నాన్న భీమేశ్వరరావు టైలర్. అమ్మ దుర్గ గృహిణి. 6వ తరగతి నుంచి నేర్చుకుంటున్నా. నాలుగు సార్లు జాతీయస్థాయిలో ఆడాను. పలు రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించా. క్రీడా కోటాలో రైల్వేలో ఉద్యోగం సాధించాలనేది నా లక్ష్యం. **- నందినీ దేవి**

క్రీడా కోటాలో సాధిస్తా..



డిగ్రీ రెండో ఏడాది చదువుతున్నా. నాన్న వీరనాగేశ్వరరావు చిరు వ్యాపారి, అమ్మ సుజాత గృహిణి. పాఠశాల స్థాయి నుంచి ఆడుతున్నా. అనేక రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించా. రెండుసార్లు జాతీయస్థాయిలో ఆడాను. జాతీయ జట్టులో స్థానం సాధించి, అంతర్జాతీయ పోటీల్లో ఆడాలి. క్రీడా కోటాలో రైల్వే ఉద్యోగం సాధించాలి. **- స్వర్ణపావని**

జాతీయస్థాయి పతకమే లక్ష్యం..



డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నా. నాన్న సత్తిబాబు ఆటోడ్రైవర్, అమ్మ కుమారి గృహిణి. 7వ తరగతి నుంచి శిక్షణ తీసుకుంటున్నా. కాకినాడ డీఎస్ఏలోని టర్ఫ్‌కోర్టులో సాధన చేస్తున్నా. రెండుసార్లు జాతీయస్థాయిలో పాల్గొన్నా. ఈసారి రాష్ట్ర జట్టులో స్థానం సాధించా. జాతీయస్థాయిలో పతకం సాధించడమే లక్ష్యం. **- సంధ్య**

స్వచ్ఛతకు తెరవని తాళం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: అయిదేళ్ల కిందట బహిరంగ మల, మూత్ర విసర్జన నిషేధంలో భాగంగా నగర పరిధిలో పలుచోట్ల మరుగుదొడ్లు నిర్మించారు. నిర్మాణంలో చూపిన శ్రద్ధ.. వినియోగంలోకి తీసుకురావడంలో చూపకపోవడంతో అవన్నీ మరుగున పడ్డాయి. దీంతో రూ.లక్షల ప్రజాధనం వృథా అయ్యింది.

ప్రారంభించకుండానే..

నగరంలో గొడారిగుంట నుంచి డైరీఫారం సెంటర్‌కు వెళ్లే దారిలో, ఎస్.అచ్చుతాపురం రైల్వే గేటు సమీపాన రెడ్‌క్రాస్ వైపు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన పర్యావరణ హిత మరుగుదొడ్లు ప్రారంభించకుండానే మూతపడ్డాయి. పచ్చ రంగులోని మరుగుదొడ్లు, సెప్టిక్ ట్యాంకులు, నీటి ట్యాంకులు ఏర్పాటు చేశారు. వినియోగంలోకి తీసుకురావటంలో విఫలమయ్యారు. దీంతో మందుబాబులకు అడ్డాగా ఇవి మారాయి.


గొడారిగుంట- డెయిరీఫారం రోడ్డులో..

నిర్వహణ లేక..

సర్పవరం జంక్షన్ వద్ద ఇదే మాదిరి పర్యావరణ హిత మరుగుదొడ్డిని ఏర్పాటు చేశారు. దీన్ని వినియోగంలోకి తీసుకురావడంతో కొంతకాలం బాగానే ఉపయోగపడింది. ఆపై నిర్వహణ లేక మూతపడింది. నీటి ట్యాంకుకు చిల్లు పడటంతో నీళ్లు బయటకు వచ్చేస్తున్నాయి. చుట్టూ అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. పక్కనే స్మార్ట్‌సిటీ బస్టాప్ ఉంది. బస్సుల కోసం వచ్చే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

అక్షరాలా రూ.5 లక్షలు..

స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా సంజయ్‌నగర్ క్రైస్తవ శ్మశాన వాటిక వద్ద రెండేళ్ల కిందట మరుగుదొడ్లు నిర్మించారు. ఇటుగా వెళ్లే ప్రజలు, శ్మశాన వాటికకు వచ్చే వారి కోసం నిర్మించారు. విద్యుత్తు, నీటి సదుపాయం కల్పించారు. ఇంతవరకు తాళాలు మాత్రం తీయలేదు. దీనికి రూ.5 లక్షలు ఖర్చు పెట్టారు. వినియోగంలోకి రాక ఈ మొత్తం వృథాగా మారింది.


అచ్చుతాపురం రైల్వే గేటు వద్ద ఇలా..

వినియోగంలోకి తెస్తాం..

బహిరంగ ప్రదేశాల్లో మరుగుదొడ్ల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ట్యాంకర్లను నీటితో నింపుతున్నాం. ఎక్కడైనా ఇబ్బందులుంటే సరిచేస్తున్నాం. వినియోగానికి దూరంగా ఉన్న మరుగుదొడ్లనూ వినియోగంలోకి తెస్తాం. నగరంలో బహిరంగ మల, మూత్ర విసర్జన జరగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తాం. **- డా.పృథ్వీచరణ్, ఎంహెచ్‌వో, నగరపాలక సంస్థ**

ఆకట్టుకున్న గాత్రకచేరి

గాంధీనగర్: సూర్యకళా మందిరంలో శుక్రవారం జరిగిన గాత్ర సంగీత కచేరి సమ్మోహితుల్ని చేసింది. కొచ్చికి చెందిన శ్రీరంజని పలు రాగాలు, కృతులను ఆలపించారు. గానసభ అధ్యక్షులు కెవిఎస్.ఆంజనేయమూర్తి, ఎల్.సత్యనారాయణ్, పి.రామకృష్ణ, పి.సూర్యకుమారిలు కళాకారులను సత్కరించారు.

గోసంరక్షణ కేంద్రానికి సాయం

గాంధీనగర్: ప్రపంచ జంతు సంరక్షణ దినోత్సవం సందర్భంగా నగరంలోని ఎన్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని గోసంరక్షణ శాలలోని గోవులకు లయన్స్ ఎలైట్ క్లబ్ సభ్యులు శుక్రవారం పచ్చిగ్రాసం, కూరగాయలను అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడారు.


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం కార్యకర్తలు

ఉచిత ఇసుక అమలుకు ధర్నా

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక హామీని తక్షణం అమలు చేయాలని సీపీఎం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద శుక్రవారం ఆందోళన చేశారు. ఇసుక సరఫరా విషయంలో గత వైకాపా, ప్రస్తుత కూటమి ప్రభుత్వాల మధ్య తేడా లేదన్నారు. సీపీఎం జిల్లా కన్వీనర్ మోర్త రాజశేఖర్ మాట్లాడుతూ ఉచిత ఇసుక లభించట్లేదని, నిల్వలు, రవాణా, ఇతర కారణాలతో అధిక ధరలు వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ రవాణా పెరిగిందని, కొన్నిచోట్ల ప్రజాప్రతినిధులు పెత్తనం చేస్తున్నారని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నాయకుల మాటలకు, క్షేత్రస్థాయి పరిస్థితికి పొంతన లేదన్నారు. ఇప్పటికైనా ఉచిత ఇసుక సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు దువ్వ శేషబాబ్జీ, కేవీఎస్ శ్రీనివాస్, తిరుమలశెట్టి నాగేశ్వరరావు, పలివెల వీరబాబు, పెద్దిరెడ్డి రామకృష్ణ, సీహెచ్.రాజ్‌కుమార్, సీహెచ్.అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, జేసీని కలిసిన తోట సుధీర్

కాకినాడ కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన జనసేన కాకినాడ నగర అధ్యక్షుడు తోట సుధీర్ శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్‌మీనాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఖరీఫ్ ధాన్యం సేకరణ, రైతుల ఖాతాలకు సొమ్ముల చెల్లింపు, పీడీఎస్ వ్యవస్థకు రేషన్ బియ్యం సరఫరా, తదితర అంశాలపై చర్చించారు. పీడీఎస్ బియ్యం పేదలకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.


తోట సుధీర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న కలెక్టర్

వేతనాలు చెల్లించాలని డిమాండ్

గాంధీనగర్, న్యూస్‌టుడే: విద్యాశాఖలో కీలకంగా పనిచేసే సమగ్ర శిక్ష ఉద్యోగులు దసరా పండగలోనూ పస్తులతో గడపాల్సిన పరిస్థితి నెలకొందని సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్‌లు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. తక్షణం పెండింగ్ వేతన బకాయిలు చెల్లించాలని కోరారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీ ఇచ్చారని, వందరోజులైనా సమస్యలు పరిష్కరించలేదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన చేస్తామన్నారు.

నేటినుంచి బాలమందిరంలో పోటీలు

గాంధీనగర్: బాల మందిరం అష్టమ వార్షికోత్సవం, దసరా సందర్భంగా విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు బాల మందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు అంగర గోపాల కృష్ణ తెలిపారు. బాలమందిరంలో సభ్యత్వం పొందిన విద్యార్థులు మాత్రమే పోటీలకు అర్హులన్నారు. గెలిచిన వారికి దసరా సందర్భంగా బహుమతులు ఇస్తామన్నారు. శనివారం ఇన్‌డోర్ గేమ్స్, ఆదివారం చిత్రలేఖనం, సోమవారం కబడ్డీ, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్ జరుగుతాయన్నారు. వివరాలకు 99631 63136 నంబరులో సంప్రదించాలన్నారు.

7 నుంచి అభ్యుదయ గీతాలపై శిక్షణ

గాంధీనగర్: ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్‌ల ఆధ్వర్యంలో 7, 8, 9 తేదీల్లో దేశభక్తి అభ్యుదయ గీతాల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.సంజయ్, ఎ.వాసులు తెలిపారు. దసరా సెలవుల సందర్భంగా కచేరిపేటలోని యూటీఎఫ్ హోంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు వివరించారు. రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకూ కొనసాగుతుందన్నారు.

7న వికాసలో ఉద్యోగ మేళా

కాకినాడ కలెక్టరేట్: కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో 7న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు వికాస పీడీ కె.లచ్చారావు శుక్రవారం తెలిపారు. బ్యాంకు ఆఫ్ బరోడాలో కస్టమర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, ముత్తూట్ ఫిన్‌కార్ప్‌లో గోల్డ్ రిలేషన్ ఆఫీసర్, బ్రాంచి సేల్స్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ ఆఫీసర్, ఎస్‌బీఐ కార్డులో సేల్స్ ఆఫీసర్, రిప్యూటెడ్ ఫార్మా కంపెనీలో టెక్నీషియన్, హెల్పర్, కెమిస్టు, ఐసాన్ ఎక్స్‌పీరియన్సెస్‌లో టెలీ సేల్స్ రిప్రజెంటేటివ్స్, ఇసుజు మోటార్స్, పానాసోనిక్, డీఎస్‌సీ అండ్ ఇండిగో ఎంఐఎంలో టెక్నీషియన్ పోస్టులకు ముఖాముఖీ నిర్వహించనున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు సోమవారం ఉదయం 9 గంటలకు విద్యార్హత పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

కాకినాడ కలెక్టరేట్: స్థానిక రామకృష్ణారావుపేట, ఆనందభారతి ప్రాంతాల్లో శుక్రవారం ఎంహెచ్‌వో డాక్టర్ డి.పృథ్వీచరణ్ పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఇళ్ల నుంచి చెత్త సేకరణ, మురుగు కాలువలను శుభ్రం చేసే పనులను పర్యవేక్షించారు. తడి, పొడి చెత్త, హానికర వ్యర్థాలను వేర్వేరుగా ప్రతీ కుటుంబానికి నగరపాలక సంస్థ సమకూర్చిన డబ్బాల్లో వేసి, వాటిని పారిశుద్ధ్య సిబ్బందికి ఇవ్వాలని అవగాహన కల్పించారు. శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వసుధ వస్త్ర ప్రదర్శన


కొనుగోలుదారులతో సందడిగా..

గాంధీనగర్: నగరంలోని నాగమల్లి తోట జంక్షన్ సమీపంలోని ద్వారంపూడి భాస్కరరెడ్డి, పద్మావతి కల్యాణ మండపం ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శన, విక్రయాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, సీతాకాంత్‌లు మాట్లాడుతూ గృహిణులు, మహిళలు, విద్యార్థినులకు ఉపయోగపడేలా దేశం నలుమూలల నుంచి ప్రఖ్యాతిగాంచిన సుమారు 50కు పైగా డిజైనర్లు రూపొందించిన వస్త్రాలను ప్రదర్శనలో ఉంచామన్నారు. ముంబయి, దిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కతా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల నుంచి ప్రముఖ డిజైనర్లను తీసుకొచ్చి సరికొత్త రకాలు పరిచయం చేసినట్లు పేర్కొన్నారు. 6వ తేదీ రాత్రి 9గంటల వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు.

అమ్మరూపం.. చూసిన కనులదే భాగ్యం


పెద్ద శివాలయంలో అమ్మవారు


భానుగుడి శివాలయంలో..


సంతచెరువులో..


రామారావుపేట శివాలయంలో..


రాజాజీ వీధిలో..


బాలాత్రిపుర సుందరి ఆలయంలో భక్తులు

గాంధీనగర్: నగరంలో శరన్నవరాత్రి మహోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. అమ్మవారి ఆలయాలు శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, రామలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం, చండీహోమం చేశారు. సాయంత్రం అమ్మవారు ఊయలపై ఊగుతూ దర్శనమిచ్చారు. రాత్రి 12 గంటలకు అమ్మవారి నవావరణార్చన, అన్నప్రసాద వితరణ జరిగింది. రిజర్వు పోలీసులైన్‌లోని అయ్యప్ప ఆలయంలో గోపూజ, కామాక్షి అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమం చేశారు. సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. సంతచెరువు కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. దేవాలయం వీధిలోని పెద్ద శివాలయంలో బాలాత్రిపుర సుందరి అమ్మవారిని విజయలక్ష్మిగా అలంకరించారు. ఈవో రాజేశ్వరరావు పర్యవేక్షించారు. జగన్నాధపురంలోని జమ్మిచెట్టు సెంటర్ వద్ద గల కనకదుర్గ, రామారావుపేటలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి, సినిమారోడ్డులోని శ్రీకామాక్షి, రైల్వేకాలనీలోని శ్రీకనకదుర్గ అమ్మవార్లకు, శ్రీనగర్‌లోని కనకదుర్గాదేవి ఆలయంలో కుంకుమపూజలు చేశారు. రాజాజీవీధిలో శ్రీదేవీ యువజన సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతున్నాయి. భానుగుడి సెంటర్‌లోని ఉషాబాలాత్రిపుర సుందరీ సమేత భానులింగేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు జరిగాయి.

'న్యాయ పోరాటానికి సిద్ధం కావాలి'

కాకినాడ కలెక్టరేట్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దాఖలైన రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసిందని, న్యాయపరంగా ఇంకా అనేక అవకాశాలు ఉన్నాయని, మాలలు అధైర్యపడొద్దని పీవీ రావు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోకుమార్ సూచించారు. స్థానిక శాంతినివాస్‌లో ఆయన అధ్యక్షతన శుక్రవారం మాలమహానాడు అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. రాజ్యాంగంలో ఉన్న వెసులుబాటు ఆధారంగా న్యాయపోరాటానికి నిపుణులతో చర్చిస్తామన్నారు. మళ్లీ పిటీషన్ దాఖలు చేస్తామన్నారు. మాలలంతా ఏకమై న్యాయ పోరాటానికి సిద్ధం కావాలన్నారు. మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, జల్లి శ్రీనివాసరావు, మూలే మేఘరాజు, వారా జార్జి, పొంగు నూకరాజు, వేలంగి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సత్యవతీదేవి డిగ్రీ కళాశాలలో తక్షణ ప్రవేశాలు

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: కాకినాడ జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2024-25 ఏడాదిలో డిగ్రీ ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని ప్రిన్సిపల్ డా.వి.అనంతలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7 నుంచి 9వ వరకు మూడురోజులపాటు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. విద్యార్థినులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో కళాశాల కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వివరాలకు 78938 45767 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

వన్యప్రాణుల సంరక్షణతోనే జీవ వైవిధ్యం

కాకినాడ నగరం: జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ ప్రసాద్ సూచించారు. వన్య ప్రాణుల సంరక్షణతోనే జీవ వైవిధ్యం సాధ్యమన్నారు. ఈనెల 2 నుంచి 8 వరకు జరుగుతున్న వన్య ప్రాణుల వారోత్సవాలను పురస్కరించుకుని కాకినాడ వివేకానంద పార్కులోని శాఖా గ్రంథాలయంలో 'సహజీవనం ద్వారా వన్య ప్రాణుల సంరక్షణ' అనే అంశంపై చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. నాలుగో తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్థులకు పాల్గొన్నారు. 34 పాఠశాలలు, కళాశాలల నుంచి 286 మంది హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రసాద్ మాట్లాడుతూ వ్యవస్థల్లో సమతుల్యత ఉన్నప్పుడే జీవుల మనుగడ సాధ్యమన్నారు. ఏదైనా జాతి నశించిపోతుందంటే ఆ జాతిపై ఆధారపడిన ఇతర ప్రాణులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. యూఎన్‌డీపీ జిల్లా సమన్వయకర్త శ్రీహర్ష మాట్లాడుతూ జీవుల పరిరక్షణలో మడ అడవుల పాత్ర కీలకమన్నారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ అడవులను వృద్ధి చేసుకోవడంతో ద్వారా వన్య ప్రాణులను కాపాడుకోవచ్చన్నారు. గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు, వైల్డ్ లైఫ్ బయాలజిస్ట్ డి.మహేష్‌బాబు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


చిత్రలేఖన పోటీల్లో విద్యార్థులు

తాగి బండి నడిపిన.. 10 మందిపై కేసులు

మసీదు సెంటర్(కాకినాడ): మద్యం తాగి వాహనం నడిపిన 10 మందిపై కేసులు నమోదు చేశారు. సీఐలు ఎన్.రమేష్, డి.రామారావు వివరాల మేరకు నగర ట్రాఫిక్-1, 2 విభాగ పోలీసులు శుక్రవారం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. 10 మందిని హాజరుపర్చగా ఒకరికి మూడు రోజుల జైలు, నలుగురికి రెండు రోజుల జైలు, ఆరు మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు సెకెండ్ క్లాస్ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి వి.నరసింహారావు తీర్పు చెప్పారన్నారు.

శభాష్ శ్రీనివాసరావు



సాంబమూర్తినగర్: ఎస్‌బీకేఎఫ్ 10వ అంతర్జాతీయ పోటీల్లో కాకినాడకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ మందపల్లి శ్రీనివాసరావు మూడు బంగారు పతకాలు సాధించిన విషయం విదితమే. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన డీపీటీవో ఎం.శ్రీనివాసరావు, డిపో అసిస్టెంట్ కమిషనర్ ఎంయూవీ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. వారు అభినందించారు.

5, 6 తేదీల్లో బస్‌పాస్‌ల జారీ నిలిపివేత

సాంబమూర్తినగర్: కాకినాడ ఆర్టీసీ బస్టాండులో జారీ చేసే అన్నిరకాల బస్‌పాస్‌లను 5, 6 తేదీల్లో నిలుపుదల చేసినట్లు డిపో అసిస్టెంట్ కమిషనర్ ఎంయూవీ మనోహర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్ సాఫ్ట్‌వేర్ ఆధునికీకరణ కారణంగా రెండు రోజులపాటు పాస్‌లను నిలిపేస్తున్నట్లు చెప్పారు. 7వ తేదీ నుంచి యథావిధిగా జారీ చేస్తామన్నారు.

దర్శన టికెట్ల ధరలు తగ్గించాలని వినతి

గాంధీనగర్: నగరంలోని బాలాత్రిపుర సుందరి ఆలయంలో అమ్మవారి దర్శనానికి రూ.20, 30, 50 ధరల టికెట్లతో సామాన్యులను ఇబ్బంది పెడుతున్నారని పౌర సంక్షేమ సంఘ కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ధరలు తగ్గించాలన్నారు. ఆలయం తెరిచినప్పటి నుంచి మూసే వరకు ఉచిత దర్శనం అందుబాటులో ఉంచాలన్నారు.

గాల్లో ప్రయాణం.. ప్రాణాలు పణం

కాకినాడ నుంచి అమలాపురం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సుల్లో కళాశాల విద్యార్థులు ప్రయాణిస్తున్న తీరు ఆందోళనకు గురిచేసింది. నిల్చునే స్థలం లేకపోయినా బస్సు ఫుట్‌పాత్‌లపైకి ఎక్కి, గాల్లో వేలాడుతూ అత్యంత ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఏమాత్రం పట్టుతప్పినా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది. తక్కువ బస్సులు ఉండటం, వందలమంది విద్యార్థులు ఉండటంతో ఉదయం, సాయంత్రం సమయాల్లో ఈ పరిస్థితి నెలకొంటోంది. బంగారం లాంటి భవిత ఉన్న విద్యార్థుల సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్**



ఓటు దరఖాస్తులు వేగంగా పరిష్కరించాలి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ నగర నియోజకవర్గంలో ఇంటింటా సర్వేలో ఓటు నమోదు, తొలగింపు, చేర్పులు, మార్పులకు వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, మున్సిపల్ కమిషనర్ భావన ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను ఆమె తనిఖీ చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025లో భాగంగా చేపట్టిన ఇంటింటా జాబితా సర్వేలో 3,500 దరఖాస్తులు రాగా, 90 శాతం పరిష్కరించామన్నారు. శనివారం సాయంత్రంలోగా మిగతా వాటిని పరిష్కరించి నివేదిక ఇవ్వాలన్నారు. నివేదికను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. ఏఈఆర్వో, అర్బన్ తహసీల్దారు వి.జితేంద్ర పాల్గొన్నారు.


సూచనలిస్తున్న ఈఆర్వో, కమిషనర్ భావన

మున్సిపల్ ఉపాధ్యాయుల దీక్షలు

కాకినాడ నగరం: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోరుతూ కాకినాడ నగర పాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న యూటీఎఫ్ ఉపాధ్యాయులు శుక్రవారం దీక్షలు చేపట్టారు. అర్బన్ డీఐ కార్యాలయం వద్ద చేపట్టిన దీక్షలను నగర అధ్యక్షుడు బి.రవిశ్రీనివాస్ ప్రారంభించగా, జిల్లా కార్యదర్శి వజ్రపు మహేష్, రాష్ట్ర కౌన్సిలర్ బి.ధర్మరాజు, నగర ప్రధాన కార్యదర్శి వరలహాలబాబు దీక్షలకు ఆహ్వానం పలికారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు కల్పించాలని, పీఎఫ్ సౌకర్యం, ఎంఈవో పదోన్నతులు ఇవ్వాలని, మున్సిపల్ పాఠశాలల్లో సమాంతర మాధ్యమాన్ని అమలు చేయాలన్నారు. జీవో 117ను రద్దు తదితర సమస్యల పరిష్కారానికి దీక్షలు చేపట్టారు. సీహెచ్‌వీ రమణ, వాడపర్తి శ్రీనివాస్, వజ్రపు మహేష్, బి.రవిశ్రీనివాస్, దాకోజు మల్లికార్జునుడు, బి.రాజబాబు, ఏ.పాపారావు, వీరబాబు, నరేంద్ర తదితరులు కూర్చున్నారు. అర్బన్ ఎంఈవో చెవ్వూరి రవిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.



కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

రూ.50 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణం

తాళ్లరేవు, న్యూస్‌టుడే: కోరింగ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి పెయ్యల మంగేష్ అధ్యక్షతన ఉపాధిహామీ గ్రామసభ శుక్రవారం జరిగింది. ఈవోపీఆర్డీ మల్లాడి భైరవమూర్తి మాట్లాడారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆదేశాలతో రూ.50 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణ పనులకు ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. తాగునీరు, డ్రెయినేజీలు, పుంతరోడ్లు వంటి సమస్యలపై సభలో చర్చించారు. పంచాయతీ కార్యదర్శి రామరాజు, మాజీ సర్పంచి టేకుమూడి లక్ష్మణరావు, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు పొన్నమండ రామలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు పోతుల రత్నకుమారి, పెమ్మాడి కృష్ణవేణి, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు వాడ్రేవు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

7న ఉద్యోగ మేళా

కాకినాడ కలెక్టరేట్: కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో 7న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు వికాస పీడీ కె.లచ్చారావు శుక్రవారం తెలిపారు. బ్యాంకు ఆఫ్ బరోడాలో కస్టమర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, ముత్తూట్ ఫిన్‌కార్ప్‌లో గోల్డ్ రిలేషన్ ఆఫీసర్, బ్రాంచి సేల్స్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ ఆఫీసర్, ఎస్‌బీఐ కార్డులో సేల్స్ ఆఫీసర్, రిప్యూటెడ్ ఫార్మా కంపెనీలో టెక్నీషియన్, హెల్పర్, కెమిస్టు, ఐసాన్ ఎక్స్‌పీరియన్సెస్‌లో టెలీ సేల్స్ రిప్రజెంటేటివ్, ఇసుజు మోటార్స్, పానాసోనిక్, డీసాన్ అండ్ ఇండిగో ఎంపవలో టెక్నీషియన్ పోస్టులకు ముఖాముఖి నిర్వహించనున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు సోమవారం ఉదయం 9 గంటలకు విద్యార్హత పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మద్యం దుకాణంతో అవస్థలు

సమస్య: పాత ప్రభుత్వాసుపత్రివీధి ఎదురుగా ఉన్న అగ్రహారంలో చెత్త తరలింపునకు పురపాలక సంఘం పారిశుద్ధ్య కార్మికులు సక్రమంగా రావడం లేదు. అలాగే మద్యం గొలుసు దుకాణం వద్ద కొందరు ఆకతాయిలు మహిళలతో అసభ్యంగా ప్రవరిస్తున్నారు.

– ఓ పాఠకుడు, పెద్దాపురం

సమాధానం: అగ్రహారంలో చెత్త తొలగింపు నిత్యం జరిగేలా చర్యలు తీసుకుంటాం. మద్యం దుకాణదారుపై వెంటనే విచారణ జరిపించి చర్యలు తీసుకుంటాం.

– కేవీ పద్మావతి, మున్సిపల్ కమిషనర్,
– మౌనిక, ఎస్సై, పెద్దాపురం

- న్యూస్‌టుడే, పెద్దాపురం

మురుగు నిలిచి ఇక్కట్లు

సమస్య: గొల్లప్రోలు పల్లపువీధిలో డ్రెయిన్లు పూడుకుపోయి మురుగు ప్రవహించడం లేదు. ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్వాసనతో పాటు దోమల ఉద్ధృతితో కంటిమీద కునుకు ఉండడం లేదు.

– జి.ఈశ్వర్, గొల్లప్రోలు

పరిష్కారం: వెంటనే వ్యర్థాలు, పూడిక తొలగింపు పనులు ప్రారంభిస్తాం.

రఘుప్రసాద్, పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి

- న్యూస్‌టుడే, గొల్లప్రోలు

తాగునీరు వృథా

సమస్య: కరప కొత్తపేట రామాలయం వీధిలో వీధి కుళాయి పైపులైన్ పగుళ్లు తీయడంతో తాగునీరు వృథాగా పోతోంది.

– సలాది మనోజ్‌కుమార్

సమాధానం: వెంటనే సిబ్బందిని పంపించి వీధిలో పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తాం.

– సాదే ఆశాజ్యోతి, సర్పంచి

- న్యూస్‌టుడే, కరప

రోడ్డంతా గుంతలు

సమస్య: గొర్రిపూడి నుంచి తాళ్లరేవు వెళ్లే రహదారి గుంతలు పడి అధ్వానంగా మారడంతో రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నాం.

– జి.రాజు, గ్రామస్థుడు

సమాధానం: ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రహదారిని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– సాయిబాబారెడ్డి, ఏఈ, ర.భ.శాఖ

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325
పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

అది నిర్మించలేదు.. ఇది వినియోగించలేరు

న్యూస్‌టుడే, పిఠాపురం

పారిశుద్ధ్య సమస్యలు తొలగించేందుకు ప్రభుత్వాలు ఎన్నో ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. స్వచ్ఛభారత్, స్వచ్ఛతా హీ సేవా పేరిట అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. మరోపక్క స్వచ్ఛ సంకల్పం పేరుతో ఇందుకోసం నిధులు కూడా కేటాయిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో లక్ష్యాలు నెరవేరడం లేదు. ముఖ్యంగా ఇందుకోసం చెత్తను వేరుచేసే కేంద్రాలు, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు అవసరం. ఇవి అందుబాటులోకి రాకపోవడంతో పట్టణంలో పారిశుద్ధ్య సమస్యలు అలానే ఉంటున్నాయి.

● మాధవపురంలో అయిదెకరాల్లో డంపింగ్ యార్డు ఉంది. అన్ని సదుపాయాలు బాగానేఉన్నా పారిశుద్ధ్య సమస్య రోజురోజుకూ ఎక్కువవుతోంది. ఇంటింటికీ 56 వేల డబ్బాలందించి.. చెత్తను సేకరించి.. దాని నుంచి సంపద తయారీ, మురుగునీటి శుద్ధి లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుకోసం గతంలో 15వ ఆర్థిక సంఘం నుంచి ప్రత్యేక కేంద్రాల నిర్మాణానికి నిధులు కూడా కేటాయించారు. ఈ పనులు అసంపూర్తిగా నిలిచిపోయి చెత్తను వేరుచేయడం, మురుగునీటిని శుద్ధి చేయడం వంటి పనులు నిలిచిపోయాయి. దాంతో పారిశుద్ధ్య సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది.



పశువుల సంత వద్ద అసంపూర్తిగా జీటీఎస్

నిధులిచ్చినా నిరుపయోగమే..

పురపాలిక పరిధిలో చెత్తను వేరుచేసి సంపద సృష్టించేందుకు జీటీఎస్(గార్బేజ్ ట్రాన్స్‌పోర్ట్ స్టేషన్) నిర్మించాలని 2021లో నిర్ణయించారు. ఇందుకు 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.85 లక్షలు కేటాయించి, అగ్రహారం వద్ద పశువుల సంతను ఆనుకుని ఉన్న 50 సెంట్ల స్థలాన్ని కూడా కేటాయించారు. 2022 ఏప్రిల్‌లో జీటీఎస్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించి వదిలేశారు. రెండేళ్లుగా పనుల్లో కదలిక లేదు. దాంతో చెత్తను డంపింగ్‌యార్డుకే తరలించేస్తున్నారు.

● టిడ్కో ఇళ్ల వద్ద 30 సెంట్ల స్థలంలో రూ.50 లక్షలతో ఎస్‌టీపీ (సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు) నిర్మించ తలపెట్టారు. దీని నిర్మాణం పూర్తి చేసినప్పటికీ వినియోగంలో లేదు. దాంతో మురుగునీటి శుద్ధి లక్ష్యం మరుగునపడింది.

పురపాలిక : పిఠాపురం	
వార్డులు	: 30
సచివాలయాలు	: 15
కుటుంబాలు	: 14,800
జనాభా	: 60 వేలకుపైనే
రోజుకు ఉత్పత్తయ్యే చెత్త	: 26 మె॥టు॥
పారిశుద్ధ్య కార్మికులు	: 96
చెత్త ట్రాక్టర్లు	: 6
పుష్‌కార్టులు	: 30
ఈ-ఆటోలు	: 8
కాంపాక్టర్లు	: 2



టిడ్కో గృహాల వద్ద వినియోగంలో లేని ఎస్‌టీపీ

అందుబాటులోకి తీసుకొస్తాం

పట్టణంలో పారిశుద్ధ్య సమస్య మెరుగుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. జీటీఎస్, ఎస్‌టీపీ ప్లాంట్లు వినియోగంలోకి తెస్తాం. జీటీఎస్ నిధులు పూర్తిగా విడుదలకాక సమస్య నెలకొంది. త్వరలోనే పనులు పూర్తిచేయించి, చెత్తను వేరుచేసే ప్రక్రియ మొదలు పెడతాం. మరుగునీటి శుద్ధి కూడా ప్రారంభిస్తాం.

– నామా కనకారావు, పురపాలిక కమిషనర్

అన్నవరం సత్యవతీదేవి డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

సాంబమూర్తినగర్: కాకినాడ జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2024-25 ఏడాదిలో డిగ్రీ ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని ప్రిన్సిపల్ డా.వి.అనంతలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7 నుంచి 9వ వరకు మూడురోజులపాటు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. విద్యార్థినులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో కళాశాల కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వివరాలకు 78938 45767 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

పిఠాపురం డిగ్రీ కళాశాలలో..

పిఠాపురం: పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తక్షణ ప్రవేశాలు ప్రారంభించామని ప్రిన్సిపల్ డా.పి.సుభాషిణి తెలిపారు. బీఏ ఎకనామిక్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్సు, జువాలజీ (ఆనర్స్)లో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. విద్యార్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలు, మూడు సెట్ల జెరాక్స్ పత్రాలు, 3 ఫొటోలతో ఈనెల 7 నుంచి 9వ తేదీలోగా చేరవచ్చన్నారు.

ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభలు

గొల్లప్రోలు: గ్రామాలవారీగా ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులు గుర్తించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీవో కొండలరావు తెలిపారు. తాటిపర్తి, చినజగ్గంపేట, ఎ.విజయనగరం గ్రామాల్లో పనుల గుర్తింపునకు శుక్రవారం నిర్వహించిన గ్రామసభల్లో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సిబ్బంది 15 రోజులపాటు పర్యటించి కొత్త పనులను గుర్తిస్తారని చెప్పారు. రైతులకు ప్రయోజనం, కూలీలకు పనులు లభించేలా ఉభయతారకంగా ఉండే పనులు ఎంపిక చేయాలన్నారు. పంచాయతీ, సచివాలయాల సిబ్బంది, అధిక సంఖ్యలో రైతులు, ఉపాధిమేట్లు పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం ఎన్నిక

కొత్తపల్లి, న్యూస్‌టుడే: ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల కార్యవర్గాన్ని శుక్రవారం సురక్ష ప్యాలెస్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా పిల్ల శ్రీను, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శిగా చోడిపల్లి శ్రీను, నాగేశ్వరరావుతో పాటు పలువురు సభ్యులను ఏకగ్రీవంగా ఎంపికచేశారు. వీరితో జిల్లా అధ్యక్షుడు తోట సూర్య సుబ్బారావు శుక్రవారం ప్రమాణం చేయించారు. మండలంలోని ఫొటో, వీడియోగ్రాఫర్లు నూతన కార్యవర్గ సభ్యులను సత్కరించారు.

కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకుందామని కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీ పిలుపునిచ్చారు. మున్సిపల్ కల్యాణ మండపంలో శుక్రవారం జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, నియోజకవర్గం ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి తరఫున 5 వార్డులకు అయిదుగురు సభ్యులను బలపరిచినట్లు చెప్పారు. బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజీ

త్వరలో శాశ్వత వంతెన నిర్మాణం

పెద్దాపురం, న్యూస్‌టుడే: త్వరలో కాండ్రకోట దబ్బకాలువపై శాశ్వత వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప చెప్పారు. శుక్రవారం మోడల్ తాత్కాలిక వంతెన నిర్మాణానికి ఆయన కొబ్బరికాయ కొట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ పాలనలో వరుసగా మూడుసార్లు వచ్చిన వరదలతో ఇక్కడ నిర్మించిన తాత్కాలిక వంతెన కొట్టుకుపోయిందన్నారు. అప్పటి నుంచి శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో స్థానికులు అవస్థలు ఎదుర్కొంటున్నారని వివరించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు ఎలిశెట్టి నాని, తోట రామకృష్ణ, గ్రామానికి చెందిన తెదేపా నాయకులు, రైతులు పాల్గొన్నారు.



వంతెన నిర్మాణానికి కొబ్బరికాయ కొడుతున్న చినరాజప్ప

సామర్లకోట: పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శుక్రవారం వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సామర్లకోట విచ్చేసిన ఆయన తహసీల్దార్ పాత కార్యాలయం సమీపంలోని వరసిద్ధి వినాయక ఆలయంలో గణపతిని దర్శించుకున్నారు. అనంతరం వ్యాన్ స్టాండ్ వద్ద వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టణ తెదేపా అధ్యక్షుడు అడబాల కుమారస్వామి, కార్యదర్శి బడుగు శ్రీకాంత్, కౌన్సిలర్ బలుసు శ్రీనివాస్, మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ యార్లగడ్డ రవిచంద్రప్రసాద్, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో దసరా రద్దీ



రైలు కోసం ప్లాట్‌ఫారంపై ప్రయాణికులు

సామర్లకోట, న్యూస్‌టుడే: విజయదశమి పర్వదినం సందర్భంగా ప్రయాణికుల రాకపోకలు శుక్రవారం నుంచే పెరిగాయి. సామర్లకోట రైల్వేస్టేషన్ మీదుగా విశాఖపట్నం, విజయవాడ మార్గాల్లో ప్రయాణించే వారితో స్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలు కిటకిటలాడాయి. ఇక్కడి నుంచి ఆయా ప్రాంతాలకు వెళ్లేవారు, వచ్చిన వారితో స్టేషన్ ఆవరణ ఉదయం నుంచి రాత్రి వరకు సందడిగా మారింది. శుక్రవారం విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లేవారితో పాటు విజయవాడ, హైదరాబాద్, తిరుపతి, చెన్నై వైపు వెళ్లేవారు అధికంగా తరలివచ్చారు. వీరిలో ఎక్కువ మందికి రిజర్వేషన్ దొరక్కపోవడంతో సాధారణ బోగీల్లో కిక్కిరిసి ప్రయాణించారు. ఈ విషయమై రైల్వేస్టేషన్ మేనేజర్ ఎం.రమేష్‌ను వివరణ కోరగా రైల్వే ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనపు రైళ్లు రెండు మూడు రోజుల్లో అందుబాటులోకి వస్తాయని చెప్పారు. కొన్ని రైళ్లను ప్రత్యేకంగా జనరల్ బోగీలతోనే నడుపుతున్నారని వివరించారు.

అర్బన్ బ్యాంకు ఎన్నికకు తప్పని పోటీ

సయోధ్య కుదిర్చిన నేతలు

పిఠాపురం, న్యూస్‌టుడే: అర్బన్ బ్యాంకు ఎన్నికలకు రంగం సిద్ధమైంది. పార్టీలకు అతీతంగా జరిగే ఈ ఎన్నికను ఎవరికీ వారే ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో పోటీ అనివార్యమైంది. జనసేన, తెదేపా నుంచి అభ్యర్థులు బరిలోకి దిగారు. వారికి పార్టీ గుర్తులు కూడా కేటాయించారు. దీంతో రెండు పార్టీల నేతల్లో విభేదాలు రేగే ప్రమాదం ఉందని గుర్తెరిగి ఆయా పెద్దలు రంగంలోకి దిగి సయోధ్య కుదిర్చారు. ఇంతలో నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగియడంతో చేసేదేమీ లేక పలుమార్లు చర్చల అనంతరం కూటమి అభ్యర్థుల జాబితా ప్రకటించారు. ఎట్టకేలకు సయోధ్య కుదిర్చినా 18 మంది నామినేషన్లు వేశారు. వీరిలో ఆరుగురు పోటీ నుంచి తప్పుకోగా బరిలో 12 మంది ఉన్నారు.



● తెదేపా నుంచి కాకినాడ నగర ఎమ్మెల్యే కొండబాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్‌ఎన్‌వర్మ, జనసేన నుంచి కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీ, జనసేన జిల్లా, నియోజకవర్గం అధ్యక్షులు తుమ్మల రామస్వామి, మర్రెడ్డి శ్రీనివాస్ పలుమార్లు సమావేశమై కూటమి అభ్యర్థులను గెలిపించి ఐక్యత చాటాలని కృషిచేస్తున్నారు.

బ్యాంకు చరిత్ర ఇదీ.. పిఠాపురం కోటగుమ్మం సెంటర్‌లోని అర్బన్ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీని 1919లో మహారాజా తమ సిబ్బంది సంక్షేమంకోసం ప్రారంభించారు. క్రమేణా అదే బ్యాంకుగా.. అర్బన్ బ్యాంకుగా మారింది. బ్యాంకు పాలకవర్గం ఎన్నిక పార్టీలకు అతీతంగా నిర్వహించి ఛైర్మన్‌ను నియమిస్తారు. ఇప్పటివరకు ఎనిమిది మంది అధ్యక్షులుగా పనిచేశారు. పురపాలక సంఘం ఛైర్మన్ హోదాకు సమానంగా ఈ పదవిని పోల్చుతారు. ఈ కారణంగా ఎక్కువ మంది పోటీపడుతుంటారు. ఈసారి జనసేన, తెదేపా నేతలు ఛైర్మన్ పదవి కోసం పట్టుపడుతున్నారు.

కూటమి అభ్యర్థులు వీరే.. అర్బన్ బ్యాంకుకు ఈనెల 6వ తేదీన ఎన్నిక జరగనుంది. ఇప్పటికే తెదేపా, జనసేన నుంచి విడివిడిగా పోటీచేసిన అభ్యర్థులు తమకు కేటాయించిన గుర్తులపై ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. శుక్రవారం నాటికి అయిదుగురు మాత్రమే కూటమి బలపరిచిన అభ్యర్థులని ప్రకటించారు. వీరిలో 1వ వార్డు నుంచి విళ్ల వీరవెంకట నాగేశ్వరరావు, 2వ వార్డు నుంచి చెల్లుబోయిన ప్రమీల, 3వ వార్డు అద్దంకి వెంకటరమణ, 4వ వార్డు అరిగెల ప్రసాదరావు, 5వ వార్డు నుంచి మేళం రామకృష్ణ పోటీలో ఉన్నారు. ఛైర్మన్ పదవి జనసేనకు, వైస్‌ఛైర్మన్ పదవి తెదేపాకు కేటాయిస్తున్నట్లు అధిష్ఠానం వెల్లడించింది. ఈనెల 7న ఛైర్మన్ పదవికి ఎన్నిక జరుగుతుంది.



గ్రాంటులో పాలకనకదుర్గమ్మ అలంకరణలో బాలిక



కొమరగిరిలో పార్వతీదేవిగా..



కాండ్రకోటలో గాయత్రి



తూరంగి శ్రీకనకదుర్గాదేవి ఆలయంలో సామూహిక కలశ పూజ

భక్తుల కళ్లలో శక్తిరూపిణి..

పెద్దాపురం, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా దుర్గమ్మ, మరిడమ్మ, నూకాలమ్మ దేవాలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. వర్ఘులవారివీధిలోని భువనేశ్వరి పీఠంలో అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

సామర్లకోట: పంచారామ క్షేత్రం సామర్లకోట కుమారారామ భీమేశ్వరాలయంలో బాలాత్రిపుర సుందరి అమ్మవారు అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ఈవో నీలకంఠం, వేద పండితులు సోమేశ్వరశర్మ, రాజగోపాలశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పిఠాపురం: పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరి అమ్మవారు బాలాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. పదోశక్తి పీఠం పురుహూతిక అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయ స్వామివార్లకు అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమపూజలు జరిపించారు.

గొల్లప్రోలు: ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీవిజయదుర్గ అమ్మవారిని గాయత్రిమాతగా అలంకరించారు. తాటిపర్తిలోని అపర్ణాదేవి ఆలయానికి భక్తులు పోటెత్తారు.

కరప: పెద్దాపురప్పాడులో ఉమాపార్వతీదేవిని గాయత్రీదేవిగా అలంకరించారు. శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి ఊయలసేవ నిర్వహించారు.

తాళ్లరేవు: కోరింగ దుర్గామల్లేశ్వర ఆలయంలో గాయత్రిదేవి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. గ్రాంటు పాలకనకదుర్గమ్మ ఆలయ అర్చకులు రాయప్రోలు కామేశ్వరశర్మ, గ్రామపెద్దల సమక్షంలో బాలపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీతారామపురంలో భవానీ భక్తుల ఆధ్వర్యంలో పడిపూజ చేశారు.

సర్పవరం జంక్షన్: రమణయ్యపేటలోని గోకుల్‌గార్డెన్ శ్రీకామాక్షి సమేత ఏకామ్రేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కుంకుమపూజలు చేశారు. కామాక్షి అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. తూరంగిలోని శ్రీకనకదుర్గాదేవి ఆలయంలో కాకినాడ వెండి, బంగారం వర్తక సంఘం అధ్యక్షుడు అనిశెట్టి రామకృష్ణ దంపతుల ఆధ్వర్యంలో కలశ పూజల్లో మహిళలు పాల్గొన్నారు.

పెదపూడి: సంపర విజయదుర్గాదేవి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. వివిధ పూలతో అమ్మవారిని గాయత్రి దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు.

కొత్తపల్లి: దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కొమరగిరి శ్రీబాలదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు శుక్రవారం పార్వతీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలకరించారు. సమీప ప్రాంతాల్లోని భక్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సర్పవరం జంక్షన్: రాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి ఆలయంలో 62 రోజులపాటు అయ్యప్పస్వాములు, భవానీ దీక్షాధారులకు ఉచిత అన్నప్రసాదం (భిక్ష) ఏర్పాటు చేశామని సర్పవరం అయ్యప్పస్వామి అన్నదాన కమిటీ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు.



భువనేశ్వరి పీఠంలో..




కరపలో పర్వతవర్ధినీదేవి



పెద్దాపురప్పాడులో..



కోరింగలో గాయత్రీదేవి



రమణయ్యపేట ఈశ్వర్‌నగర్‌లో..

వన్యప్రాణులను కాపాడుకుందాం..

తాళ్లరేవు, న్యూస్‌టుడే: చొల్లంగి పర్యాటక కేంద్రంలో వన్యప్రాణుల వారోత్సవాల కార్యక్రమం శుక్రవారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పురవీధుల్లో అటవీ రేంజ్ అధికారి ఎస్.ఎస్.ఆర్.వరప్రసాద్ ఆధ్వర్యంలో కోరింగ అభయారణ్యంలోని వన్యప్రాణులను కాపాడుకుందాం.. మడ అడవులను రక్షించుకుందామంటూ వన్యప్రాణి విభాగం అధికారులు, సిబ్బంది అవగాహన ర్యాలీ చేశారు.



చొల్లంగిలో వన్యప్రాణి విభాగం అధికారుల ర్యాలీ

ఈక్రాప్‌లో నమోదైన పంటల తనిఖీ

గొల్లప్రోలు: ఈక్రాప్‌లో నమోదుచేసిన పంటలను ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఎన్.మల్లికార్జున శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం దస్త్రాలు తనిఖీ చేశారు. పిఠాపురం మండలం విరవాడ, కోలంక, అగ్రహారం, గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఉద్యాన శాఖ అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈక్రాప్ సూపర్‌చెక్ కార్యక్రమంలో భాగంగా తనిఖీలు చేపట్టామన్నారు. మిశ్రమ పంటగా సాగుచేస్తున్న ఆయిల్‌పాం, కొబ్బరి, అరటి, కూరగాయ తదితర పంటలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఉద్యాన శాఖ అధికారి కె.శైలజ, సిబ్బందితో సమావేశమయ్యారు.



పంటలను తనిఖీచేస్తున్న మల్లికార్జున

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

తాళ్లరేవు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్, రగ్బీ పోటీలకు పి.మల్లవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. సెప్టెంబరు 26, 28 తేదీల్లో కాకినాడలో జరిగిన ఈ పోటీల్లో అండర్-17 విభాగంలో హ్యాండ్‌బాల్‌లో బండారు పావని, అండర్-14లో హ్యాండ్‌బాల్‌లో భట్రాజు బాలాజీయాదవ్, పెయ్యల సంకీర్తన, రగ్బీ అండర్-14లో సమనాస సురేష్‌కుమార్, వెంటపల్లి జయశ్రీ ఎంపికయ్యారన్నారు. వీరంతా గుంటూరు, కడప జిల్లాల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యాకమిటీ ఛైర్మన్ బళ్ల చిరంజీవి, పీడీ రాజరాజేశ్వరి అభినందించారు.

ఉచిత ఇసుక హామీ అమలు కోరుతూ ధర్నా



పెద్దాపురం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పెద్దాపురం, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక హామీని ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరుతూ శుక్రవారం పెద్దాపురం ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయినా ఇసుక అందుబాటులో లేకపోవడం, ధరలు పెరగడం, అవినీతితో ప్రజల్లో అసంతృప్తి పెరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్.శ్రీనివాస్, కేదారి నాగు, పాశీల రమణ, తైనాల శ్రీను, చింతల సత్యనారాయణ, గొల్లబాబు, విష్ణు, సూర్యనారాయణ, ఇబ్రహీం, భూసారి శ్రీను, బాషా, హరిబాబు, శివ, జి.సత్తిబాబు, కె.వీరబాబు పాల్గొన్నారు.

● **సామర్లకోట:** రాష్ట్రంలో ఉచిత ఇసుకను సక్రమంగా అందించాలని కోరుతూ సీపీఎం పట్టణ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కరణం ప్రసాద్ మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ కె.చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ధర్నాలో సీపీఎం శాఖ కార్యదర్శి విప్పర్తి కొండలరావు, నాయకులు కరణం గోవిందరాజు, సురేష్, పి.వీరబాబు, కరణం ఏడుకొండలు, టి.శ్రీను, సీహెచ్.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

● **పిఠాపురం:** ఉచిత ఇసుక సక్రమంగా అందక భవన నిర్మాణ కార్మికులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని సీపీఎం మండల కన్వీనర్ కుంచే చిన్న అన్నారు. పిఠాపురం తహసీల్దారు కార్యాలయం ఎదుట శుక్రవారం సీపీఎం, సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో నిరసన తెలిపి, అనంతరం వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో నాయకులు కోనేటి రాజు, మణి, డేగల సత్యనారాయణ, రమణ, వీరబాబు, గోపాలకృష్ణ, సూర్యనారాయణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

● **గొల్లప్రోలు:** సీపీఎం నేత కె.చిన్న, సీఐటీయూ నాయకులు నందీశ్వరరావు, పెద్దింటి రమణ ఆధ్వర్యంలో గొల్లప్రోలు తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఎం, భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దారు నాగసౌజన్యకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జి.ఆనందరావు, డి.రాంబాబు, శ్రీను, ఉలవల కొండ, తలాటి రాంబాబు, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

● **తాళ్లరేవు:** రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుకహామీని తక్షణమే అమలు చేయాలంటూ కోరింగలో సీపీఎం మండల శాఖ అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు ఆధ్వర్యంలో మహిళలు శుక్రవారం నిరసన తెలిపారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తాళ్లరేవులో ఉప తహసీల్దారు సూరిబాబుకు అందించారు. సీపీఎం నాయకులు వల్లు రాజుబాబు, వి.శ్రీనివాస్, వి.ఏడుకొండలు పాల్గొన్నారు.

● **కొత్తపల్లి:** కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ఇసుక హామీని తక్షణమే అమలుచేయాలని కోరుతూ శుక్రవారం సీపీఎం నేతలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గురాల అప్పారావు, సత్యనారాయణ, సాంబశివరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తుని

•తుని •ప్రత్తిపాడు •జగ్గంపేట

వార్డుల వారీగా సమస్యలు పరిష్కరిస్తాం



ఏలేశ్వరం 16వ వార్డులో మురుగు కాలువను పరిశీలిస్తున్న కమిషనర్

ఏలేశ్వరం: పట్టణంలోని ప్రతి ప్రాంతాన్ని సందర్శించి ప్రజల ఇబ్బందులను పరిష్కరిస్తామని నగర పంచాయతీ కమిషనర్ ఎం.సత్యనారాయణ అన్నారు. ఏలేశ్వరంలోని 16వ వార్డులో శుక్రవారం ఆయన పర్యటించారు. వార్డులో ప్రజలతో మాట్లాడి వారి ఇబ్బందుల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. స్థానికంగా ఉన్న మురుగు నీటి కాలువలను పరిశీలించి శుభ్రత అవసరమైన పనులు చేపట్టాలని సూచించారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణకు ప్రాధాన్యమిస్తున్నామని ఆయన తెలిపారు. మెప్మా సమన్వయకర్త సాయికుమార్ పాల్గొన్నారు.

ముంపు తొలగించేందుకు చర్యలు

కిర్లంపూడి, న్యూస్‌టుడే: జగపతినగరం గ్రామంలోకి కొత్తచెరువు నుంచి నీరు భారీగా తరలిస్తుండడంతో గ్రామం మొత్తం ముంపునకు గురైన సంగతి తెలిసిందే. గ్రామంలో ముంపు నీటిని తొలగించేందుకు గ్రామ వెంబడి ర.భ.రోడ్డును ఆనుకుని ఉన్న రెండువైపులా డ్రైన్లలో పూడిక తొలగించే పనులు శుక్రవారం చేపట్టారు. పంచాయతీ సర్పంచి శ్రీలత, ఉపసర్పంచి గౌరు జగన్నాథం, గ్రామనాయకుడు గుడాల రాంబాబు తదితరులు పనులను పర్యవేక్షించారు.



జగపతినగరంలో కాలువలో పూడిక తొలగిస్తున్న పొక్లెయిన్

కోర్కెలు తీర్చే కల్పవల్లి.. కరుణించవమ్మా



తుని బెల్లపువీధిలో అన్నపూర్ణగా..



సత్యదేవి క్షేత్ర రక్షకుడు వనదుర్గ..

న్యూస్‌టుడే, బృందం: తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో శుక్రవారం దుర్గాదేవి అమ్మవారు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి కరుణించవమ్మా అంటూ గ్రామాల్లో పూజలు, భజనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



ఇ.గోకవరంలో దుర్గాదేవికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు



శంఖవరం: దుర్గామీనాక్షి




పాదపూజ చేస్తున్న మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు

తపోవనంలో యనమల పూజలు

తుని గ్రామీణం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తపోవనం ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామీజీ సమక్షంలో రాజరాజేశ్వరి అమ్మ వారికి పాదపూజ చేసి స్వామీజీ ఆశీర్వచనాలు తీసుకున్నారు.



రాచపల్లిలో అపీత కుచాంబ..



జగ్గంపేటలో..

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

చెత్త తొలగించారు..

తొండంగి: మండలంలోని పీతచిన్నాయిపాలెం గ్రామంలోని పలు వీధులు చెత్తతో నిండి ఉన్నాయి. సమస్యను స్థానిక యువత 'మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకువచ్చారు. పంచాయతీ కార్యదర్శి సూరిబాబు దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. మంగళవారం పొక్లెయిన్‌తో చెత్త కుప్పలు తొలగించారు.

మోటారుకు మరమ్మతులు

కిర్లంపూడి: జగపతినగరంలోని నాలుగో వార్డులో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు మోటారు కాలిపోవడంతో స్థానికులు నాలుగు రోజులుగా తాగునీటికి అవస్థలు పడుతున్నారు. ఇక్కడి పరిస్థితిని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేయడంతో ఈ సమస్యను సర్పంచి మహేంద్రాడ శ్రీలత దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె స్పందించి శుక్రవారం మోటారుకు పంచాయతీ సిబ్బందితో మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

చేజేతులా ముంపు

కాలువలు, గట్లపై నిర్మాణాలతోనే సమస్య

– న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

చెరువు గట్టును ఆక్రమించడం, నీటి మార్గాలు మూసేయడంతోనే ముంపు కష్టాలు వస్తున్నాయి. నియోజకవర్గంలోని ప్రతి చెరువుదగ్గరా ఈ జాడ్యం వెంటాడుతోంది. నీరు వచ్చి పోయే మార్గాలను మూసేయడం వల్ల ముంపు సమస్యలు తలెత్తుతున్నాయి. ఇళ్ల మధ్య నుంచి నీరు కదలని తీరు ఉంది. ఈ ఏడాది జులై నుంచి కురుస్తున్న వర్షాలకు తరచూ ఈ పరిస్థితి ఎదురవుతోంది.



కొండివారి చెరువు గట్టు వెంబడి నిర్మాణాలు



చెరువు సమీప రహదారిపైకి చెరువు నీరు

60 గ్రామాల్లో ఊళ్ల మధ్య చెరువులు ఉండగా వీటి నీటిమార్గాలు క్రమేపీ కనుమరుగు అవుతున్నాయి. నియోజకవర్గ కేంద్రంలోని గ్రామశివారు సబ్‌స్టేషన్ సమీపంలోని కొండివారి చెరువు, ప్రత్తిపాడు గోవిందరాజుల చెరువు, ఊర చెరువులు ఇందుకు ఉదాహరణలు. ఈచెరువుల నుంచి నీటిదారులు అస్తవ్యస్తం అవ్వడం వల్ల పదిహేను చోట్ల ముంపు సమస్యలు ఎదురవుతున్నాయి.

కాలువ మూసుకుపోవడంతో ఇబ్బంది..

గ్రామంలోని హైస్కూలు సమీపంలోని కొండ పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షం నీరు ఆర్‌అండ్‌బీ రోడ్డును సంబంధించిన తూరల నుంచి వెళ్లేది. క్రమేపీ ఈ తూరల వెంటన మూసుకుపోగా, ఊరి మధ్య గోవిందరాజుల చెరువుకు వెళ్లే కాలువ ఆక్రమణలకు గురైంది. దీంతో వర్షం పడినప్పుడల్లా అగ్నిమాపక కేంద్రం సమీపంలో నీరు నిలిచిపోతుంది. ఇళ్లు, ఇతర భవనాలు, దుకాణాలు నిర్మించడం తప్ప నీరు పారే మార్గాలు లేక వాననీరు జలమయం అవుతున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా ఆసుపత్రి వార్డులు ముంపు బారిన పడగా, గ్రామంలోని పలుచోట్ల నీరు నిలిచిపోవడం ఇందుకు నిదర్శనం. సాగు, తాగునీటి చెరువులను వెంటాడుతున్న సమస్యలపై వివరాలు సేకరిస్తున్నామని జలవనరుల శాఖ అధికారి ఒకరు తెలిపారు.

జీవ వైవిధ్యంతోనే మానవ మనుగడ సాధ్యం

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: సృష్టిలో ప్రతి జీవి స్వేచ్ఛగా జీవించే హక్కును కలిగి ఉండాలని ఏలేశ్వరం అటవీ శాఖ క్షేత్రాధికారి దుర్గ రాంప్రసాద్ అన్నారు. వన్య ప్రాణి సంరక్షణ వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డి.సునీత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వన్య ప్రాణుల ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ పీవో ప్రగడ ప్రయోగమూర్తి మాట్లాడుతూ అడవుల శాతం తగ్గిపోవడంతో పలు ప్రాంతాల్లో మూగ జీవాలు జనారణ్యంలోకి వస్తున్నాయన్నారు. వైస్ ప్రిన్సిపల్ డి.చెన్నారావు, డీఆర్వో జాన్సన్, బీట్ అధికారులు ఈశ్వరరెడ్డి, మీనాక్షి, సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అటవీ శాఖాధికారి రాంప్రసాద్

యనమలను కలిసిన పలువురు అధికారులు

తుని గ్రామీణం: మాజీ మంత్రి యనమల రామకృష్ణుడును నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పలువురు అధికారులు తేటగుంట పార్టీ కార్యాలయంలో శుక్రవారం కలిశారు. తుని సెక్షన్ అటవీశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన శేఖర్ బాబు, పెద్దాపురం ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన శ్రీరమణి యనమలను కలిశారు. ఆయాశాఖల పనితీరు మెరుగుపర్చాలని ఆయన సూచించారు.



యనమలకు మొక్క అందిస్తున్న తుని అటవీశాఖ అధికారి శేఖర్‌బాబు



ఏలేశ్వరంలో నినదిస్తున్న ఆర్టీసీ కార్మికులు

ఆర్టీసీ డీఎం వైఖరికి నిరసనగా కార్మికుల ఆందోళన

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: ఏలేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఎంప్లాయిస్ యూనియన్ ప్రాంతీయ కార్యదర్శి పి. సత్యానందం, కార్మిక ఐకాస నాయకులు ఎన్‌వీ రావు, యూబీఎం కుమార్, కె. త్రిమూర్తులు అన్నారు. డీఎం విధానాలను వ్యతిరేకిస్తూ ఎంప్లాయిస్ యూనియన్, ఎన్ఎంయూ, యునైటెడ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఆందోళన శుక్రవారం 4వ రోజుకి చేరింది. డిపో మెయిన్ గేట్ వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎర్ర బ్యాడ్జీలను ధరించి కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. కండక్టర్ ఎస్. శ్రీనివాస రావుపై అక్రమంగా విధించిన సస్పెన్షన్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానా

తుని, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 12 మందిని దివాణం వీధిలోని కోర్టులో శుక్రవారం హాజరుపరిచామని సీఐ ఎం. గీతా రామకృష్ణ తెలిపారు. వీరికి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున రూ.1.20 లక్షలు జరిమానా విధించారన్నారు.

నిందితులకు జైలుశిక్ష

అన్నవరం, న్యూస్‌టుడే: రాగితీగల దొంగతనం కేసులో నలుగురు నిందితులకు జైలుశిక్ష పడినట్లు ఎస్సై జి.హరిబాబు శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శంఖవరం గ్రామంలో గతంలో విద్యుత్తు నియంత్రికలోని రాగితీగల దొంగతనం జరిగినట్లు ఫిర్యాదు వచ్చిందని, దీనిపై కేసు నమోదు చేసి, నిందితులు ఎస్.సతీష్, కె.దుర్గా, ఎన్.నాగేంద్ర, ఎన్.లోవరాజులను కోర్టులో హాజరుపరిచామన్నారు. దీనిపై వాదోపవాదాల అనంతరం ప్రత్తిపాడు న్యాయమూర్తి నిందితులకు నాలుగు నెలల జైలు శిక్ష విధించినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మల్లిసాలలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై రఘునాథరావు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మాతా సత్తిబాబు మోటారు సైకిల్‌పై రోడ్డుదాటుతుండగా వేగంగా వచ్చిన ఆటో బలంగా ఢీకొంది. దీంతో సత్తిబాబు రోడ్డుపక్కన పడిపోగా తలకు బలమైన గాయమైంది. సత్తిబాబును చికిత్సనిమిత్తం జగ్గంపేట సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని కుమారుడు నాని ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కబేళాకు తరలిస్తున్న గోవులు, ఎడ్ల స్వాధీనం

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కబేళాకు తరలిస్తున్న 20 గోవులు, ఎడ్లను అశ్వారావుపేట పోలీసులు రక్షించారు. ఎస్సై యయాతి రాజు కథనం ప్రకారం ఆంధ్రాలోని తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసిన 20 గోవులు, ఎడ్లను రెండు వ్యాన్లలో హైదరాబాద్‌లోని కబేళాకు తరలిస్తుండగా అశ్వారావుపేట శివారులోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. నిందితులైన తునికి చెందిన దేవర దుర్గా ప్రసాద్, అంగులూరి అశోక్‌లను అరెస్టు చేసి వాహనాలను సీజ్ చేశారు. పట్టుబడిన పశువులను పాల్వంచ గోసంరక్షణశాలకు తరలించారు.

16 మందిపై కేసు నమోదు

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 16 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చామని తుని రూరల్ ఎస్సై కృష్ణామాచారి తెలిపారు. నిందితులకు ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున తుని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

తాటాకు ఇల్లు దగ్ధం

కిర్లంపూడి, న్యూస్‌టుడే : సోమవరం గ్రామంలోని దళిత పేటలో మాసా అర్జమ్మ అనే వృద్ధురాలి తాటాకు ఇల్లు విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ కారణంగా శుక్రవారం రాత్రి కాలిపోయింది. ఇంటి పైకప్పు నుంచి మంటలు వ్యాపించడంతో ఇంట్లోనే ఉన్న అర్జమ్మ బయటకు పరుగులు తీసింది. స్థానిక యువకులు బకెట్లతో మంటలను ఆర్పే ప్రయత్నం చేయగా ఇల్లు మొత్తం కాలిపోయింది. ఇంటిలో టీవీ, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ. 50వేలు ఆస్తినష్టం ఉంటుందని స్థానికులు తెలిపారు. బాధితురాలికి ఏవిధమైనా ఆసరాలేకపోవడంతో కట్టు బట్టలతో రోడ్డున పడిందని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కాలనీవాసులు అధికారులను కోరారు.

దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ

జగ్గంపేట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తుంది అనడానికి 7వ తేదిన దివ్యాంగులకు అందించే ఉపకరణాలే నిదర్శనం అని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఆలిమ్కో సంస్థ సహకారంతో విభిన్న ప్రతిభావంతులకు అందించే ఉపకరణాలను ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. ప్రత్యేక శిబిరంలో అర్హత పొందిన 350 మంది దివ్యాంగులకు 550 ఉపకరణాలు అందించేందుకు ఏర్పాటు చేస్తున్నామని, జగ్గంపేట పాతపోలీస్‌స్టేషన్ వద్ద ప్రత్యేక శిబిరంలో 7వ తేదిన అందిస్తామని అన్నారు. తెదేపా నాయకులు మారిశెట్టి భద్రం, జిల్లా విభిన్నప్రతిభావంతుల అధ్యక్షులు మండపాక అప్పన్నదొర పాల్గొన్నారు.



దివ్యాంగులకు అందించబోయే ఉపకరణాలను పరిశీలిస్తున్న నెహ్రూ

కార్యాలయం కింద నుంచి ఊటలు



ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: వర్షాలు కురిసినా ఎండకాస్తే అంతటా ఆరుదలగా ఉంటుంది. ప్రత్తిపాడు తహసీల్దారు కార్యాలయం మాత్రం నీళ్లోడుతూ ఉంది. భవనం కింద నుంచి నీటి ఊటలు ప్రవాహంలా వస్తూ ఆవరణను చిత్తడి నేలగా మార్చాయి. భారీ వర్షాలు కురిస్తే కార్యాలయం గోడలు చెమ్మదేరిపోవడంతో పాటు పునాదిలోంచి నీళ్లు వస్తూనే ఉంది. ఈ ఆవరణలో ఉన్న వాటికన్నా తహసీల్దారు కార్యాలయం పల్లం అవ్వడం ఇందుకు కారణం. 1980లో నిర్మించిన ఈ భవనం కాలం చెల్లిందని పదేళ్ల క్రితమే ఇంజినీర్లు ధ్రువీకరించగా పునర్నిర్మాణానికి ఎవరూ చొరవ చూపలేదు. సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు.

ముగిసిన క్రీడాపోటీలు

తుని పట్టణం, న్యూస్‌టుడే: పాయకరావుపేటలోని శ్రీప్రకాష్ విద్యా సంస్థలో మూడు రోజుల నుంచి జరుగుతున్న సీబీఎస్‌ఈ క్లస్టర్ - 7 బాలికల కబడ్డీ, వాలీబాల్ ఛాంపియన్ షిప్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన వివిధ ప్రాంతాల్లోని సీబీఎస్‌ఈ స్కూళ్ల నుంచి సుమారు 1,200 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభచూపారు. ఆయా పోటీల్లో విజేతలకు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత చేతుల మీదుగా పతకాలు, ట్రోఫీలు అందించారు. చదువుతోపాటు ఆసక్తి ఉన్న రంగం వైపు ఆడపిల్లలు దృష్టి సారించాలన్నారు. జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎన్.సూర్యారావు, విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వికె నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్‌లు మంత్రిని సన్మానించి జ్ఞాపిక అందించారు.



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న హోం మంత్రి అనిత

కబడ్డీ పోటీల్లో విజేత రాచపల్లి జట్టు

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: మండలంలోని కొత్త యర్రవరంలో గత ఐదు రోజులుగా కూటమి నాయకుల నేతృత్వంలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. పోటీల్లో రాచపల్లి జట్టు విజేతగా నిలిచింది. రెండు, మూడు స్థానాలను మల్లేపల్లి, కోలంక గ్రామానికి చెందిన జట్లు సాధించాయి. తెలుగు రైతు జిల్లా కార్యదర్శి బసా ప్రసాద్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మైరాల కనకారావు వారికి నగదు, బహుమతులు అందించారు.



వినతిపత్రం అందజేస్తోన్న డి.పోలవరం గ్రామస్థులు

సమస్యలు పరిష్కరించాలంటూ ఎమ్మెల్యేకు వినతి

శంఖవరం: తమ గ్రామంలో సమస్యలను పరిష్కరించాలంటూ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు శంఖవరం మండలం డి.పోలవరం గ్రామస్థులు శుక్రవారం వినతిపత్రం అందించారు. రహదారులు నిర్మాణం, తాగునీరు, అర్హులైన వారికి పింఛన్లు వంటి సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎమ్మెల్యే త్వరలోనే సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

రైతు సేవా కేంద్రం ప్రారంభం

కిర్లంపూడి, న్యూస్‌టుడే: గ్రామస్థాయిలో రైతుల అవసరాలు తీర్చేలా రైతు సేవా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎంపీపీ తోట రవి పేర్కొన్నారు. మండలంలోని జగపతినగరంలో నూతనంగా నిర్మించిన రైతు సేవాకేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. భవనం లోపలి గదులను సర్పంచి మహేంద్రాడ శ్రీలత, మండల తెదేపా అధ్యక్షుడు చదరం చంటిబాబు, కుర్ల చిన్నబాబు తదితరులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు గుడాల రాంబాబు, కాళ్ల వెంకటేష్, ఆళ్ల నానాజీ, శ్రీమన్నారాయాణ, మండల వ్యవసాయాధికారి జోకా అమృత పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎంపీపీ తోట రవి

ప్రభుత్వ కార్యాలయాలకు స్థల దానం

గండేపల్లి, న్యూస్‌టుడే: పుట్టిన ఊరికి ఏదో ఒక విధంగా సాయపడాలనే తపన ఉన్న వ్యక్తులు అరుదుగా ఉంటారు. అటువంటి వ్యక్తులు గ్రామానికి అవసరం వస్తే ఆస్తి విలువ ఎంతయినా ధారాదత్తం చేయడానికి వెనుకాడరు. అలాంటి వ్యక్తుల్లో ఒకరు గండేపల్లి మండలం జడ్.రాగంపేట గ్రామానికి చెందిన కందుల చిట్టిబాబు.



ప్రభుత్వ నిధులతో నిర్మాణాలు పూర్తిచేసిన కార్యాలయాలు

మంచి ఆలోచనతో ముందుకొచ్చి..

మంచి ఆలోచనతో కందుల చిట్టిబాబు సెంటు రెండు లక్షల విలువైన 40 సెంట్ల సొంత భూమిని ప్రభుత్వ కార్యాలయాలకు దానం చేశారు. దానం చేయడమే కాకుండా ఆ భూమిలో చొరవ తీసుకుని తన అన్న కందుల కొండయ్యదొర పేరు మీదుగా సచివాలయం, తల్లిదండ్రులు కందుల వీర్రాజు, సుభద్రమ్మల పేరుమీదుగా హెల్త్ క్లినిక్ సెంటర్, తాతయ్య, నాయనమ్మలు కొండయ్య, బాపన్నమ్మలు పేరుమీదుగా రైతు సేవా కేంద్రాలను ప్రభుత్వ నిధులతో నిర్మించారు. మొదట వేరే గుత్తేదారుడికి పనులు అప్పగించినా గత ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో ఆయనే చొరవ తీసుకుని కార్యాలయాలను రెండు సంవత్సరాల్లోనే పూర్తిచేసి గ్రామస్తులకు అందించారు. దీంతో వారంతా ఆనందం వ్యక్తం చేశారు.

గ్రామానికి దగ్గరలో భూమిలేక సొంతంగా ఇచ్చా



గత ప్రభుత్వంలో గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు దగ్గరలో భూమి లేక పోవడంతో ఎక్కడో దూరంగా నిర్మిస్తామన్నారు. ఊరు ఒకచోట, కార్యాలయాలు మరోచోట ఉంటే గ్రామస్థులకు ఇబ్బంది అని కార్యాలయాలకు, వెళ్లేందుకు రోడ్డుతో కలిపి 40 సెంట్ల భూమిని దానం చేసి నా కుటుంబ సభ్యుల పేరుమీదుగా నిర్మించి అధికారులకు అప్పగించా.

- కందుల చిట్టిబాబు, జడ్.రాగంపేట

రాజుపాలెంలో ప్రయాణించలేం..!

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఏలేరు వరద నీటి తాకిడికి రాజుపాలెం గ్రామపరిధిలో ర.భ. రోడ్డు తీవ్ర కోతకు గురైంది. అసలే రోడ్డు నిలువెల్లా గోతుల మయంగా మారింది. ఆపై రోడ్డు అంచు భారీ కోతకు గురికావడంతో రోడ్డుపై ప్రమాదపుటంచున ప్రయాణంగా మారింది. రోజూ వీరవరం గ్రామానికి పాఠశాల బస్సులు, సైకిళ్లపై విద్యార్థులు ఈప్రదేశం వెంబడే రాకపోకలు సాగిస్తుంటారు. ఎప్పుడు ఏప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్తులు, వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. ర.భ.శాఖ అధికారులు స్పందించి కోతకు గురైన ప్రదేశంలో రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



– న్యూస్‌టుడే, కిర్లంపూడి

వరుస ప్రమాదాలతో ప్రయాణికుల బెంబేలు

జగ్గంపేట గ్రామీణం: మండలంలోని గుర్రంపాలెం శివారు సగరపేట వద్ద మలుపుల్లో నిత్యం ప్రమాదాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో మూడు మలుపులు ఒకే చోట ఉండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. వారంరోజుల వ్యవధిలో నాలుగు ప్రమాదాలు జరగడంతో మోటారుసైకిళ్ల రోడ్డుచెంతనే వదిలేశారు. వందమీటర్ల వ్యవధిలో మూడు మలుపులు ఉన్నా కనీసం హెచ్చరిక బోర్డులు, వేగనియంత్రణకు స్పీడుబ్రేకర్లు లేకపోవడంతో వేగంగా వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో పలువురు గాయాలపాలై ఆసుపత్రుల్లో చేరుతున్నారు. మలుపుల్లో హెచ్చరికబోర్డులు, నియంత్రికలు ఏర్పాటుచేసి ప్రమాదాలను నివారించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.



గుర్రంపాలెం వద్ద మలుపులో ప్రమాదానికి గురైన మోటారుసైకిల్

గ్రామాభివృద్ధికి పనులు గుర్తింపు

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: వికసిత ఆంధ్రప్రదేశ్ సాధన కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై నిర్వహిస్తున్న గ్రామ సభను శుక్రవారం మండలంలోని కుమ్మరిలోవ గ్రామంలో నిర్వహించారు. గ్రామంలోని రహదారులు, కాలువల నిర్మాణ పనులు ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టేందుకు పనులు గుర్తించి గ్రామ తీర్మాణం చేశారు. పాడి, ఉద్యాన రైతులకు అమలు చేస్తున్న పథకాలను, రాయితీలను వివరించి ఆసక్తి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీవో నారాయణరావు, పంచాయతీ కార్యదర్శి నాగన్నదొర, స్థానిక నాయకులు జక్కాన రామునాయుడు పాల్గొన్నారు.

బాలాజీ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత సుధీర్ మృతి

జగ్గంపేట, న్యూస్‌టుడే: జగ్గంపేటకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బాలాజీగ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత **కేవీవీఆర్ఎస్ సుధీర్**(59) శుక్రవారం కన్నుమూశారు. అతని చిన్నాన్న కొత్త శ్రీరామకృష్ణ, సోదరుడు కొత్త భైరవకృష్ణ మాట్లాడుతూ సుధీర్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మృతి చెందారన్నారు. ఆయనకు భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు. సుధీర్ మృతిపట్ల జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, తెదేపా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కొత్త కొండబాబు, కుటుంబ సభ్యులు సానుభూతి తెలిపారు.

